తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శుక్రవారం
21 ఆగస్టు 2026
సంపుటి 03
సంచిక 312
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com



## కేసీఆర్ కోసం 300 కిలోమీటర్ల పాదయాత్ర

- వాంకిడి నుంచి ఎర్రవెల్లి వరకు నడక
- అభిమానులను ఆప్యాయంగా కలిసిన కేసీఆర్
- మళ్లీ ప్రభుత్వం వస్తుందని ధీమా

ఎర్రవెల్లి, ఆగస్టు 20 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతో కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం నుంచి ఇద్దరు సామాన్య అభిమానులు సుమారు 300 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి గురువారం ఎర్రవెల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్నారు. తమ అభిమానాన్ని, అంకితభావాన్ని చాటుకుంటూ చేసిన ఈ యాత్ర స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. వాంకిడి మండలానికి

మిగతా 2వ పేజిలో..

# నీట్ ఒత్తిడి వద్దు.. ప్రాణం ముద్దు

- పోటీ పరీక్షల ఒత్తిడిపై నిపుణుల ఆందోళన
- విద్యార్థులకు ధైర్యం చెప్పాల్సిన బాధ్యత అందరిదీ
- ర్యాంకుల కోసం ప్రాణాలను పణంగా పెట్టొద్దని సూచన
- మానసిక ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి



డెస్క్, ఆగస్టు 20 : నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి ఆందోళన కలిగిస్తోంది. వైద్య విద్యలో సీటు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు నెలల తరబడి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో చదువు, ర్యాంకు, తల్లిదండ్రుల అంచనాలు, భవిష్యత్తుపై భయాలు కలిసి కొందరిపై తీవ్ర మానసిక భారాన్ని మోపుతున్నాయి. మహారాష్ట్రలో నీట్‌కు సిద్ధమవుతున్న 19 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఈ సమస్య తీవ్రతను మరోసారి చాటిచెప్పింది. ఒక పరీక్షలో ఆశించిన ఫలితం రాకపోవడం జీవితానికి ముగింపు కాదని విద్యార్థులకు ధైర్యం చెప్పాల్సిన అవసరం ఉంది. విద్యార్థులపై మార్కులు, ర్యాంకుల విషయంలో తల్లిదండ్రులు అనవసరమైన ఒత్తిడి తీసుకురాకూడదు. ఇతర విద్యార్థులతో పోల్చడం, తక్కువ మార్కులు వస్తే విమర్శించడం, ఒకే వృత్తిని జీవిత లక్ష్యంగా నిర్దేశించడం వంటి చర్యలు పిల్లల్లో ఆందోళనను పెంచే అవకాశం ఉంది. పిల్లలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణాన్ని కుటుంబంలో కల్పించాలి. పరీక్ష ఫలితాల కంటే పిల్లల ఆరోగ్యం,

మిగతా 2వ పేజిలో..

## 22ఏ ఫిర్యాదులకు వేగవంత పరిష్కారం

- ప్రజలకు పూర్తి భరోసా కల్పించాలి
- పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ఆదేశాలు
- పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి



హైదరాబాద్, ఆగస్టు 20: 22ఏ నిషేధిత భూముల సమస్యల పరిష్కారంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ శాఖ మరింత వేగంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అంశంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులను అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించి, ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా సమస్యలను వేగంగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. 22ఏ ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి కాల్ సెంటర్ పనితీరు, ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార స్థితి, ఎక్కువగా వస్తున్న సమస్యలు తదితర అంశాలపై మంత్రి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో

మిగతా 2వ పేజిలో..

## గ్రూప్-1 వివాదంపై జగన్ సవాల్

- సీబీఐ విచారణకు సిద్ధమన్న వైసీపీ అధినేత
- డీఎస్సీ అంశంపై చంద్రబాబును ప్రశ్నించిన జగన్
- ఉద్యోగుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని వ్యాఖ్య



తాడేపల్లి, ఆగస్టు 20 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల వ్యవహారంలో తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. డీఎస్సీ అక్రమాల అంశం

మిగతా 2వ పేజిలో..



## నీట్ ఆందోళనలపై కమిటీ

- పోలీసుల బలప్రయోగ ఆరోపణలపై విచారణ
- ఐదుగురు సభ్యులతో ఉన్నత స్థాయి బృందం
- మధ్యంతర నివేదికలు ఇవ్వాలని సుప్రీం ఆదేశం

2వ పేజిలో..

## చీనాబ్ వంతెనపై వందేభారత్ రికార్డు

- ప్రపంచంలోనే ఎత్తైన వంతెనపై కొత్త ఘట్టం
- గంటకు వంద కిలోమీటర్ల వేగంతో పరుగులు
- రైల్వే శాఖ అనుమతితో వేగం పెంపు
- జమ్మూ--కాశ్మీర్ రైల్వేలో మరో మైలురాయి



జమ్మూ, ఆగస్టు 20 : ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెనగా గుర్తింపు పొందిన చీనాబ్ వంతెనపై వందేభారత్ రైలు గంటకు వంద కిలోమీటర్ల వేగంతో ప్రయాణించి కొత్త చరిత్ర

మిగతా 2వ పేజిలో..



# మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన నిరసనలు

- జనగణనకు ముందు పౌర పట్టిక నవీకరణ డిమాండ్
- రెండు రోజుల సార్వత్రిక సమ్మెకు పిలుపు
- పలు జిల్లాల్లో రహదారుల దిగ్బంధనం
- మూడు రోజుల పాటు విద్యాసంస్థల మూసివేత

ఇంఫాల్, ఆగస్టు 20 : బీజేపీ పాలిత మణిపూర్‌లో మరోసారి నిరసనల జ్వాలలు రగిలాయి. రాష్ట్రంలో జనాభా గణన చేపట్టే ముందు జాతీయ పౌర పట్టికను నవీకరించాలని వివిధ సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తుండటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అంతర్గతంగా స్థానభ్రంశం చెందిన ప్రజలు తమ స్వస్థలాలకు తిరిగి చేరే వరకు జనగణన నిర్వహించకూడదని ఆందోళనకారులు పట్టుబడుతున్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం న్యాయమైన, నిష్పక్షపాత పునర్విభజన ప్రచార సంస్థ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో 48 గంటల సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిన ఉద్యమకారులు మణిపూర్ లోయ ప్రాంతంలోని పలు జిల్లాల్లో భారీ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, బిష్ణుపూర్, తౌబల్ జిల్లాల్లో అనేక ప్రాంతాల్లో రహదారులను దిగ్బంధించి రాకపోకలకు అంతరాయం కలిగించారు. దీంతో సాధారణ ప్రజల జీవనం తీవ్రంగా ప్రభావితమైంది. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురాయ్

మిగతా 2వ పేజిలో..

## రాజీవ్ గాంధీ ఆశయాలతో బలమైన భారత్

- సద్భావనా దినోత్సవం ప్రజలకు స్ఫూర్తిదాయకం
- రాజీవ్ గాంధీకి సీఎం రేవంత్ ఘన నివాళి
- శాంతి, సౌభ్రాతృత్వంతో దేశ నిర్మాణానికి పిలుపు



హైదరాబాద్, ఆగస్టు 20 మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా

మిగతా 2వ పేజిలో..

## నీట్ ఒత్తిడి వద్దు.. ప్రాణం ముద్దు

ఆనందం, ఆత్మవిశ్వాసానికి తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎంతటి ఒత్తిడి ఎదురైనా తమ పిల్లలకు అండగా కుటుంబం ఉంటుందనే నమ్మకాన్ని కల్పించాలి.విద్యాసంస్థలు కూడా విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉంది. పాఠ్యాంశాల బోధనతో పాటు విద్యార్థుల మానసిక స్థితిని ఎప్పటికప్పుడు గమనించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అధిక ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించాలి. ప్రతి విద్యాసంస్థలో మానసిక ఆరోగ్య నిపుణుల సలహాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. సరైన నిద్ర, పౌష్టికాహారం, శారీరక వ్యాయామం, తగిన విశ్రాంతి కూడా పరీక్షా సన్నద్ధతలో భాగమేనని విద్యార్థులకు అవగాహన కల్పించాలి.పోటీ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం మరింత బాధ్యతాయుతమైన విధానాలను అమలు చేయాలని పలువురు కోరుతున్నారు. పరీక్షల నిర్వహణ, ఫలితాలు, ప్రవేశ ప్రక్రియలో అనిశ్చితి లేకుండా ముందుగానే స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలి. ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల రద్దు, ఫలితాలపై వివాదాలు, ప్రవేశాల్లో జాప్యం వంటి పరిణామాలు విద్యార్థులపై అదనపు మానసిక భారాన్ని మోపే అవకాశం ఉంది. అందువల్ల పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, భద్రతను మరింత పెంచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన మానసిక సహాయ వ్యవస్థను కూడా ప్రభుత్వం బలోపేతం చేయాలి. ప్రతి విద్యార్థి తనపై తాను నమ్మకం పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. నీట్‌లో ఆశించిన ర్యాంకు రాకపోయినా జీవితంలో విజయానికి అనేక మార్గాలు ఉన్నాయని, ఒక్క పరీక్షతో ఒక విద్యార్థి ప్రతిభను నిర్ణయించలేమని చెబుతున్నారు. చదువులో ఎదురైన వైఫల్యాన్ని జీవిత వైఫల్యంగా భావించవద్దని, తీవ్రమైన ఒత్తిడి, నిరాశ, భయం లేదా ఒంటరితనం అనిపించినప్పుడు వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు లేదా మానసిక ఆరోగ్య నిపుణులతో మాట్లాడాలని సూచిస్తున్నారు. సమస్యను పంచుకోవడం బలహీనత కాదని, సహాయం కోరడం ధైర్యానికి నిదర్శనమని పేర్కొంటున్నారు.నిపుణుల అభిప్రాయం: నీట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులపై చదువు, ర్యాంకులు, తల్లిదండ్రుల అంచనాలు, భవిష్యత్తుపై ఆందోళన వంటి అంశాలతో మానసిక ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒక పరీక్షలో ఆశించిన ఫలితం రాకపోవడం జీవితానికి ముగింపు కాదని, విద్యార్థులు ఎలాంటి సమస్య ఎదురైనా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు లేదా మానసిక ఆరోగ్య నిపుణులతో మాట్లాడాలని సూచిస్తున్నారు. మార్కులు, ర్యాంకుల కంటే విద్యార్థుల ప్రాణాలు, మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, తల్లిదండ్రులు పిల్లలను ఇతరులతో పోల్చకుండా ధైర్యం, ఆత్మవిశ్వాసం కల్పించాలని చెబుతున్నారు. ప్రభుత్వం కూడా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకతతో పాటు విద్యార్థులకు మానసిక సహాయ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

## కేసీఆర్ కోసం 300 కిలోమీటర్ల పాదయాత్ర

చెందిన జాడే తిరుపతి అనే ఆటో డ్రైవర్, దుర్గం శంకర్ అనే హోటల్ కార్మికుడు ఈ పాదయాత్రను చేపట్టారు. కేసీఆర్ పట్ల ఉన్న అభిమానంతోనే ఈ యాత్ర ప్రారంభించామని, తమకు ఎలాంటి వ్యక్తిగత ప్రయోజనాలు లేదా వినతులు లేవని వారు తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతోనే ఈ ప్రయాణం చేశామని పేర్కొన్నారు.దాదాపు 11 రోజుల పాటు రోజుకు సగటున 25 కిలోమీటర్ల చొప్పున కాలినడకన ప్రయాణించి వారు ఎర్రవెల్లికి చేరుకున్నారు. మార్గమధ్యంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా తమ లక్ష్యాన్ని వదలకుండా ముందుకు సాగినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహకారంతో వారికి కేసీఆర్‌ను కలిసే అవకాశం లభించినట్లు సమాచారం. ఎర్రవెల్లిలోని నివాసానికి చేరుకున్న అభిమానులను కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ఇంత దూరం నడిచి వచ్చినందుకు అభినందించారు. ఎలాంటి స్వార్థం లేకుండా అభిమానంతో చేసిన ఈ పాదయాత్ర తమను కదిలించిందని, వారి అంకితభావాన్ని ప్రశంసించినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా కేసీఆర్ వారితో కొంతసేపు మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, జీవన విధానం గురించి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ప్రజల ఆశీస్సులతో మళ్లీ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తప్పకుండా మళ్లీ వచ్చి కలవాలని వారికి సూచించినట్లు తెలిసింది. సమావేశం అనంతరం అభిమానులకు ప్రత్యేకంగా వాహన సౌకర్యం కల్పించి స్వగ్రామాలకు పంపించారు. తమ అభిమాన నేతను ప్రత్యక్షంగా కలుసుకోవడం జీవితంలో మరచిపోలేని అనుభవమని తిరుపతి, శంకర్ తెలిపారు. ఈ ఘటన బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, సామాజిక మాధ్యమాల్లో కూడా విస్తృతంగా చర్చకు దారితీసింది.

## మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన నిరసనలు

రహదారులను దిగ్బంధించి రాకపోకలకు అంతరాయం కలిగించారు. దీంతో సాధారణ ప్రజల జీవనం తీవ్రంగా ప్రభావితమైంది.ఇంఫాల్ తూర్పు జిల్లాలోని ఖురాయ్ లామ్‌లాంగ్ ప్రాంతంలో నిరసనకారులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఖేమ్‌చంద్ సింగ్, హోం శాఖ మంత్రి గోవిందాస్ కొంతౌజమ్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రభుత్వ విధానాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆందోళనకారులు తమ డిమాండ్లు నెరవేరే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలను కూడా బహిష్కరించాలని ఉద్యమకారులు నిర్ణయించారు. గురువారం నుంచి అన్ని ప్రభుత్వ కార్యాలయాల కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. దీంతో ప్రభుత్వ యంత్రాంగంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 20 నుంచి 22 వరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలను మూసివేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా తౌబల్ జిల్లాలో నిర్వహించాల్సిన జనగణన శిక్షణా కార్యక్రమాన్ని కూడా రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. నిరసనలు మరింత ఉధృతమయ్యే అవకాశాల నేపథ్యంలో ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అప్రమత్తంగా వ్యవహరిస్తామని అధికారులు పేర్కొన్నారు.

## 22ఏ ఫిర్యాదులకు వేగవంత పరిష్కారం

22ఏ అంశానికి సంబంధించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 ఫిర్యాదులు కాల్ సెంటర్‌కు వచ్చినట్లు అధికారులు వివరించగా, ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పరిశీలించాలని మంత్రి సూచించారు.కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ తదితర అధికారులకు వెంటనే పంపించాలని ఆదేశించారు. ఫిర్యాదు పరిష్కారం అయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. సమస్యను కేవలం పరిపాలనా ప్రక్రియగా కాకుండా ప్రజల హక్కులకు సంబంధించిన అంశంగా భావించి పని చేయాలని సూచించారు. భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు చేరింది, దరఖాస్తుదారుడికి అర్హత ఉందా లేదా, ఫిర్యాదు వాస్తవమా కాదా అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన పత్రాలను పరిశీలించి, స్పష్టమైన కారణాలతో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అన్యాయం జరగకుండా ప్రతి కేసును నిష్పక్షపాతంగా పరిశీలించాలని చెప్పారు.ఇప్పటికే వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు ఇటీవల కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా అత్యవసరంగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ఇకపై కొత్త దరఖాస్తులు పేరుకుపోకుండా సమయానుకూలంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయం పెంచి సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన ప్రతి వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో వెళ్లేలా అధికారులు పనిచేయాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఒక కార్యాలయం నుంచి మరొక కార్యాలయానికి పంపుతూ ప్రజలను ఇబ్బంది పెట్టకూడదని హెచ్చరించారు. 22ఏ సమస్యను ప్రత్యేక బాధ్యతగా తీసుకుని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని, ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని మంత్రి ఆదేశించారు.

## గ్రూప్-1 వివాదంపై జగన్ సవాల్

నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ వివాదాన్ని సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. గ్రూప్-1 నియామకాలపై సీబీఐ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని, అదే విధంగా డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తుకు ప్రభుత్వం సిద్ధమా అని ప్రశ్నించారు. గ్రూప్-1 నియామకాల ప్రక్రియను ప్రస్తావించిన జగన్, ఈ నోటిఫికేషన్‌ను 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ప్రభుత్వమే విడుదల చేసిందని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ప్రిలిమినరీ పరీక్ష పూర్తైందని తెలిపారు. అనంతరం తమ హయాంలో ఫలితాలు ప్రకటించి, 2020 డిసెంబర్‌లో మెయిన్స్ పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. టీడీపీ పాలనలో ప్రారంభమైన ప్రక్రియను ఇప్పుడు రాజకీయ కోణంలో చూడడం సరికాదని వ్యాఖ్యానించారు.కోవిడ్ పరిస్థితుల కారణంగా మూల్యాంకనంలో జాప్యం జరగకుండా ఉండేందుకు ఏపీపీఎస్సీ డిజిటల్ మూల్యాంకన విధానాన్ని పరిశీలించిందని జగన్ తెలిపారు. అయితే దీనిపై కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం సూచనల మేరకు డిజిటల్ విధానాన్ని పూర్తిగా పక్కనపెట్టామని చెప్పారు. అనంతరం మాన్యువల్ విధానంలోనే జవాబు పత్రాల మూల్యాంకనం నిర్వహించామని, అదే మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ కొనసాగిందని వివరించారు. మాన్యువల్ మూల్యాంకనం పూర్తయిన తర్వాత 163 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు చేపట్టినట్లు జగన్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియ మొత్తం హైకోర్టు పర్యవేక్షణలోనే జరిగిందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు డిజిటల్ మూల్యాంకనంపై ఆరోపణలు చేయడం ద్వారా ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వారి జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. వాస్తవాలు పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం ప్రచారం చేయడం బాధాకరమన్నారు.

గ్రూప్-1 మూల్యాంకనం హాయ్‌ల్యాండ్‌లో జరిగిందన్న ప్రచారాన్ని జగన్ ఖండించారు. అక్కడ ఎలాంటి మూల్యాంకనం జరగలేదని, ఈ విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొందని తెలిపారు. దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఉపయోగించడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. వాస్తవాల ఆధారంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాల కంటే నిజాలు చివరకు వెలుగులోకి వస్తాయని జగన్ పేర్కొన్నారు. నాలుగేళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థుల భవిష్యత్తును రాజకీయ ఆరోపణలతో దెబ్బతీయకూడదని సూచించారు. డీఎస్సీ మరియు గ్రూప్-1 అంశాలపై పారదర్శక దర్యాప్తు జరిగితే నిజానిజాలు బయటపడతాయని అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, ఎన్ని ఆరోపణలు చేసినా సత్యమే గెలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

## మంత్రి పొంగులేటి భారీ అవినీతి

**చర్చకు సవాల్ చేసిన బిజెపి నేత**

**అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి కోసం ఎదురుచూపు**

హైదరాబాద్,ఆగస్ట్20 తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి భారీ అవినీతికి తెరలేపారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. మంత్రి అవినీతికి సంబంధించి అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని చెప్పారు. దీనిపై సీబీఐతో విచారణ జరిపించాలని, హౌస్ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అవినీతిపై చర్చకు సిద్ధమా? అంటూ మంత్రి శ్రీనివాస రెడ్డికి ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం సవాల్ చేశారు. తన సవాల్‌ను స్వీకరిస్తే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని కోరారు. ఈ మేరకు గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేరుకున్నారు.ఈ సందర్భంగా తన సవాల్‌పై చర్చకు రావాలని మంత్రిని ఏలేటి మరోసారి డిమాండ్ చేశారు. తాను మధ్యాహ్నం 2 గంటల వరకు ఇక్కడే ఉంటానని, శ్రీనివాస రెడ్డి రావాలని డెడ్ లైన్ విధించారు. ఈ సందర్భంగా భూభారతి, 22ఏలో అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఫీనిక్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థలకు భూ బదలాయింపులు జరిగాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రజల భూములను లాక్కున్నారని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు.

## నీట్ ఆందోళనలపై కమిటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 20 నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారానికి వ్యతిరేకంగా నిర్వహించిన చలో పార్లమెంట్ ఆందోళనల సందర్భంగా పోలీసుల బలప్రయోగంపై వచ్చిన ఆరోపణలను విచారించేందుకు సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై సమగ్ర దర్యాప్తు చేపట్టేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి కమిటీకి అధ్యక్షత వహించనుండగా, పంజాబ్-హరియాణా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.కే. ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శలిందర్ కౌర్, సీబీఐ మాజీ డైరెక్టర్ ఆర్.కే. శుక్లా, మేఘాలయ మాజీ డీజీపీ ఎల్.ఆర్. బిష్ణోయ్ సభ్యులుగా ఉన్నారు.ఆందోళనకారులపై పోలీసులు పెల్లెట్ గన్స్, టియర్ గ్యాస్, ఎలక్ట్రిక్ లాఠీలు, లాఠీచార్జి వంటి చర్యలు చేపట్టారనే ఆరోపణలను కమిటీ పరిశీలించనుంది. మహిళా నిరసనకారులపై జరిగినట్లు ఆరోపిస్తున్న హింస, భద్రతా బలగాల వ్యవహార శైలి, అవసరానికి మించి బలప్రయోగం జరిగిందా అనే అంశాలను కూడా విచారించనుంది. మరోవైపు ఆందోళనల సందర్భంగా పోలీసులపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలు, ప్రభుత్వ మరియు ప్రజా ఆస్తుల ధ్వంసంపై కూడా కమిటీ దృష్టి సారించనుంది. నిరసనల సమయంలో రెండు వర్గాల పాత్రను సమగ్రంగా విశ్లేషించి వాస్తవాలను వెలికితీయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

కమిటీ సభ్యుల అనుభవం, నైపుణ్యం, విభిన్న రంగాల ప్రాతినిధ్యాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ధర్మాసనం పేర్కొంది. కమిటీ సిఫార్సులు న్యాయస్థానానికి విలువైన మార్గదర్శకంగా నిలుస్తాయని, పోలీసు చర్యలు చట్టబద్ధ ప్రమాణాలకు అనుగుణంగా జరిగాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించింది. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో జూలై 20న ఢిల్లీలో పార్లమెంట్ వైపు నిర్వహించిన నిరసన ర్యాలీలో భద్రతా సిబ్బంది, ఆందోళనకారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అనంతరం సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోలతో బలప్రయోగంపై వివాదం చెలరేగింది. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఇప్పుడు ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తూ, మధ్యంతర నివేదికలను క్రమం తప్పకుండా సమర్పించాలని ఆదేశించింది.

## చీనాబ్ వంతెనపై వందేభారత్ రికార్డు

సృష్టించింది. ఈ అరుదైన ఘట్టం ఇటీవల చోటుచేసుకోగా, చీనాబ్ వంతెనపై ఇంత వేగంతో రైలు నడవడం ఇదే తొలిసారి కావడం విశేషం. భారత రైల్వే మౌలిక సదుపాయాల సామర్థ్యాన్ని చాటిచెప్పే ఈ పరిణామం దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. నార్తర్న్ రైల్వే పరిధిలోని వైష్ణోదేవి--బానిహాల్ మార్గం సుమారు 111 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంది. ఈ మార్గంలోనే చీనాబ్ వంతెన నిర్మించబడింది. కాశ్మీర్ లోయను దేశంలోని ఇతర ప్రాంతాలతో మరింత సమర్థంగా అనుసంధానించే ఈ రైల్వే మార్గం వ్యూహాత్మకంగానూ, ఆర్థికపరంగానూ అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు.రైల్వే శాఖ ఇటీవల ఈ మార్గంలో రైళ్ల వేగ పరిమితిని పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. భద్రతా ప్రమాణాలు, సాంకేతిక పరీక్షలు, వంతెన సామర్థ్యంపై సమగ్ర పరిశీలన అనంతరం గంటకు వంద కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడిపేందుకు అనుమతి మంజూరు చేసింది. దీంతో వందేభారత్ రైలు కొత్త వేగంతో ప్రయాణించి విజయవంతమైన రికార్డును నమోదు చేసింది. ఇప్పటి వరకు చీనాబ్ వంతెనపై గరిష్ఠంగా గంటకు 85 కిలోమీటర్ల వేగంతో మాత్రమే రైళ్లు నడిచేవి. వంతెన నిర్మాణ లక్షణాలు, భద్రతా నిబంధనలను దృష్టిలో ఉంచుకొని ఆ పరిమితిని అమలు చేశారు. అయితే తాజా పరీక్షల అనంతరం వేగ పరిమితిని మరింత పెంచడం ద్వారా రైల్వే కార్యకలాపాల్లో కొత్త దశ ప్రారంభమైంది.ఈ వేగ పెంపు వల్ల ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రయాణికులకు మరింత సౌకర్యం కలగనుంది. కాశ్మీర్ ప్రాంతానికి రైలు సేవలను వేగవంతం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి ఇది బలాన్ని చేకూర్చనుంది. పర్యాటక రంగం, వాణిజ్య రవాణా, ప్రాంతీయ అభివృద్ధికి కూడా ఈ నిర్ణయం తోడ్పడుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రపంచ దృష్టిని ఆకర్షించిన చీనాబ్ వంతెన ఇప్పటికే భారత ఇంజినీరింగ్ ప్రతిభకు ప్రతీకగా నిలిచింది. ఇప్పుడు ఆ వంతెనపై వందేభారత్ రైలు గంటకు వంద కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లడం మరో చారిత్రక ఘట్టంగా నిలిచింది. భారత రైల్వే ఆధునికీకరణలో ఇది కీలక మైలురాయిగా గుర్తుండిపోనుంది.

## రాజీవ్ గాంధీ ఆశయాలతో బలమైన భారత్

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయనకు ఘన నివాళులర్పించారు. ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ అందించిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. దేశ అభివృద్ధితో పాటు ప్రజల మధ్య శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం, ఐక్యతను పెంపొందించాలనే ఆయన ఆలోచనలు నేటికీ ప్రాసంగికమని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే సద్భావనా దినోత్సవం ప్రజలందరికీ గొప్ప స్ఫూర్తిని అందిస్తుందని రేవంత్ రెడ్డి తెలిపారు. సమాజంలో విభేదాలకు తావులేకుండా పరస్పర గౌరవం, సోదరభావంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవడం ద్వారా దేశ ప్రగతికి మరింత బలమైన పునాది వేయగలమని పేర్కొన్నారు.

దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం, జాతీయ ఐక్యతను బలోపేతం చేయాలనే రాజీవ్ గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజల మధ్య పరస్పర విశ్వాసం పెంపొందించడం, సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. 'సమైక్యతే మన శక్తి -- సద్భావనే మన ప్రగతి' అనే స్ఫూర్తితో సమాజంలోని అన్ని వర్గాలు కలిసి ముందుకు సాగాలని రేవంత్ రెడ్డి సూచించారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రజలందరూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఐక్యత, సమానత్వం, సోదరభావం ఉన్న సమాజమే బలమైన దేశానికి పునాది అవుతుందని పేర్కొన్నారు.రాజీవ్ గాంధీ ఆశయాలను నేటి తరానికి చేరువ చేయడంతో పాటు వాటిని ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ దేశ సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. శాంతియుత, సామరస్యపూర్వక వాతావరణం ఏర్పడినప్పుడే సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. సద్భావనా దినోత్సవం సందర్భంగా ప్రజలందరూ పరస్పర ఐక్యత, సామరస్యం, సమానత్వం కోసం పునరంకితం కావాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాజీవ్ గాంధీ చూపిన మార్గంలో శాంతి, సౌభ్రాతృత్వంతో కూడిన బలమైన భారతదేశ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని కోరారు.

THARANGALU DAILY NEWS

శుక్రవారం, 21 ఆగస్టు , 2026

జాతీయ దిన పత్రిక

తరంగాలు

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి ఆగస్టు 20 తరంగాలు** దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ వలిగొండ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ పిలుపునిచ్చారు. గురువారం వలిగొండ మండల కేంద్రంలో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారత ప్రధానిగా ఉన్న కాలంలో దేశంలో అనేక విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. సాంకేతిక, యువజన రంగాలలో ఆయన తీసుకొచ్చిన మార్పులు దేశాభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు,నాయకులు వాకిటి అనంతరెడ్డి,పబ్బు సురేందర్,కొండూరు భాస్కర్,ఐటిపాముల రవీంద్ర,కాసుల వెంకటేశం, కొండూరు సాయి,రేకుల ప్రభాకర్,అప్పిశెట్టి నరేందర్,కీర్తి రమేష్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజావాణి

- **జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి**



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో 'ప్రజావాణి' కార్యక్రమం అత్యంత ప్రాధాన్యతతో ప్రారంభమైంది. సామాన్య ప్రజలతో నేరుగా మమేకమై దరఖాస్తు దారులు దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను అత్యంత సావధానంగా అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఎంతో ఆశతో కార్యాలయానికి వచ్చిన ప్రజల కష్టాలను ఓపికగా వినడమే కాకుండా, వారి నుండి స్వయంగా వినతిపత్రాలను స్వీకరించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందని, సామాన్యుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన వారికి భరోసా కల్పించారు. తమ వద్దకు వచ్చిన ఏ ఒక్కరు కూడా నిరాశతో వెనుతిరగకుండా, అందరి సమస్యలను వీలైనంత త్వరగా, సానుకూలంగా పరిష్కరించేందుకు తన వంతుగా శాయశక్తులా కృషి చేస్తానని నూతి సత్యనారాయణ గౌడ్ ప్రజలకు దృఢమైన హామీ ఇచ్చారు. ఈ ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు అండగా ఉంటామనే స్పష్టమైన సందేశాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకువెళ్లాయి.

ఈ కార్యక్రమంలో శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, టి పి సి సి మద్ది శ్రీనివాసరెడ్డి, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు తూములూరి లక్ష్మీనరసింహారావు,కిలారు అనిల్ కుమార్, దామా స్వరూప, జిల్లా ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు గజ్జి సూర్యనారాయణ, విప్లవ కుమార్,నాయకులు మద్దినేని రమేష్,వేల్పుల మురళి, లింగాల రవికుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

- **సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య,మండల కార్యదర్శి సిర్పంగి స్వామి**
- **వలిగొండ తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా**

**యాదాద్రి భువనగిరి ఆర్సి, ఆగస్టు 20,తరంగాలు:**
ఏటా రెండు కోట్ల ఉద్యోగాలంటూ గద్దెనెక్కిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం,రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటిని భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య,మండల కార్యదర్శి సిర్పంగి స్వామిలు అన్నారు. గురువారం సిపిఎం ఆధ్వర్యంలో వలిగొండ తహసిల్దార్ కార్యాలయం వద్ద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ధర్నా నిర్వహించిన అనంతరం తహసిల్దార్ దశరథ నాయక్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన 12 సంవత్సరాల కాలంలో ఉద్యోగాలను భర్తీ చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పోరాడుతుంటే వారిపై దేశద్రోహులని ముద్ర వేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. ప్రస్తుతం దేశంలో 1 కోటి 83 లక్షల ఖాళీ పోస్టులు ఉన్నాయని ఒక్క రైల్వే డిపార్ట్మెంట్ లోనే 1.08 లక్షల పోస్టులు ఖాళీలు ఉన్నాయని వీటన్నిటినీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో 2 లక్షల ఖాళీ పోస్టులు ఉన్నాయని ఉన్నాయని తాము అధికారంలోకి వస్తే రెండేళ్లలో ఖాళీ పోస్టులన్నిటిని భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ వాటిని భర్తీ చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. యూత్ డిక్లరేషన్ హామీని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం,కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కలుకూరి రామచంద్రర్, వలిగొండ పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,నాయకులు రాధారపు మల్లేశం, కొండూరు సత్తయ్య, వేముల చంద్రయ్య,శీలం ఇందిర,వేముల లక్ష్మయ్య,గంగాపురం వెంకటేశం,మైసోల్ల నరేందర్,దొడ్డి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్ సి ఆగస్టు 20 తరంగాలు** వలిగొండ మండలంలోని వేములకొండ,అర్రూర్ గ్రామాల్లో స్థానిక సంస్థల సహాయ కలెక్టర్ శ్రీ ఏ. భాస్కర్ రావు,ఐఏఎస్ విస్తృతంగా పర్యటించి వైద్య సేవలు, పారిశుద్ధ్యం,మొక్కల పెంపకం,వర్షపు నీటి సంరక్షణ,అంగన్‌వాడీ సేవలు, చెయూత పింఛన్లకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ముందుగా వేములకొండ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఏ. భాస్కర్ రావు, ఐఏఎస్ ఆసుపత్రి హాజరు రిజిస్టర్లను పరిశీలించి,వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారా,అవసరమైన మందులు తగినంతగా ఉన్నాయా,ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలు, నమోదవుతున్న కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు అవసరమైన మందులు ముందుగానే సమృద్ధిగా అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు.
అనంతరం గ్రామంలో ఫారం పాండ్ల కోసం స్థలాల గుర్తింపు,వాటి నిర్మాణ పురోగతి,వర్షపు నీటి నిల్వ కోసం సోక్ పిట్స్, మ్యాజిక్ సోక్ పిట్స్ నిర్మాణంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో అందుబాటులోకి వచ్చే వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తదుపరి అర్రూర్ గ్రామంలో పర్యటించిన ఏ. భాస్కర్ రావు, ఐఏఎస్ గ్రామ పంచాయతీకి సంబంధించిన హాజరు రిజిస్టర్లను పరిశీలించి పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల పెంపకం,వర్షపు నీటి నిల్వ కోసం అనువైన ప్రదేశాల గుర్తింపు,వాటి నిర్మాణానికి సంబంధించిన పురోగతిని సమీక్షించారు.



అనంతరం అర్రూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. గర్భిణులు,శిశువుల హాజరు, కేంద్రంలో అందుబాటులో ఉన్న స్టాక్, నిల్వ సామగ్రి నాణ్యతను పరిశీలించారు. అంగన్‌వాడీ చిన్నారులతో స్వయంగా మాట్లాడి వారికి అందిస్తున్న ఆహారం నాణ్యత,రుచి మరియు ఆహారం సక్రమంగా అందుతున్న తీరుపై వివరాలు తెలుసుకున్నారు. తదుపరి అర్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండే సమయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆన్‌లైన్ చెయూత పింఛన్ దరఖాస్తుల నమోదుపై కూడా సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి చెయూత పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్న ఒంటరి మహిళల వివరాలను పరిశీలించారు. దరఖాస్తుల్లో పేర్కొన్న సమాచారం వాస్తవమా కాదా నిర్ధారించేందుకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ క్షేత్రస్థాయి పర్యటనలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి,మండల పంచాయతీ అధికారి వై. ప్రేమలత,ఏపీఓ టి. పరశురాములు, సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు డి. రమేష్ అరూర్,ఆర్. క్రాంతి వేములకొండ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, వేములకొండ గ్రామ సర్పంచ్ ఏ. వెంకటేశం, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ కార్యదర్శి తాళ్లూరి వేణు పాల్గొని మాట్లాడుతూసెప్టెంబర్ 28,29,30తేదీల్లో ఖమ్మం లో జరిగే అఖిలభారత మహాసభలకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ యం యఫ్ గోపీనాథ్ కార్యదర్శి తాళ్లూరి వేణు తెలిపారు. గురువారం స్థానిక ఎన్జీవో హాలులో జరిగిన పాత్రికేయుల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. దేశంలోని పంజాబ్, హర్యానా, పశ్చిమ బెంగాల్,ఉత్తర ప్రదేశ్,బీహార్, జార్ఖండ్, ఒరిస్సా, అస్సాం,ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా తదితర 16 రాష్ట్రల నుండి సుమారు 500మంది రైతుకూలీ ప్రతినిధులు ఖమ్మం సభల్లో పాల్గొంటారని తెలిపారు. మహాసభల్లోప్రసిద్ధ వ్యవసాయ రంగనిపునులు, శాస్త్ర వెత్తలు, బుద్ధిజీవులు,ప్రజాస్వామ్య మేధావులు పాల్గొంటారని తెలిపారు. ఆఖిలబారత రైతు కూలీ సంఘం మహాసభలు ప్రారంభం రోజున సెప్టెంబర్ 28న ఖమ్మం పట్టణంలో రైతుకూలీ లతో పెద్ద ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. రైతుకూలీలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, జలవనరుల కల్పన,రైతు పంటల గిట్టుబాటు ధర,వ్యవసాయ చట్టాల్లో ఉన్న డొల్లతనం ,రైతు బీమా,రైతు రుణమాఫీ,తదితర అంశాలపై చర్చలు మహాసభల్లో జరుగుతాయని తెలిపారు. ఖమ్మంలో జరిగే అఖిలభారత రైతు కూలీ మహాసభలకు ఎంతో ప్రాధాన్యత ఉందని అన్నారు. 16నెలలుగా డిల్లీ లో జరిగిన రైతు ఉద్యమం, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్పోరేట్ అనుకూల వ్యవసాయ సాగుచట్టాలను మోడీ ప్రభుత్వం వెనక్కు తీసుకున్నప్పటికీ దొడ్డి దారిన తిరిగి అమలు జరిపే కుతంత్రంకు కేంద్రం పాల్పడుతుందని అన్నారు. రైతుల గిట్టుబాటు ధర కోసం స్వామి నాదన్ కమీషన్ సిఫార్సులు అమలు జరపాలని,రైతులకు ఎరువులు పంపిణీలో సంక్లిష్టత తొలగించాలని కోరారు. ఈ సమావేశంలోఅఖిలబారత రైతుకూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి.కోటేశ్వర రావు పాల్గొని మాట్లాడుతూ రైతుకూలీ సంఘం ఏర్పాటు,మహాసభలు చారిత్రక ప్రాధాన్యత వివరించారు. ఈసమావేశంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర అద్యక్ష ,ప్రధాన కార్యదర్శులు మామిడాల భిక్షపతి,మండలవెంకన్నతదితరులు ప్రసంగించారు .ఆహ్వానం సంఘం తరపున ప్రముఖ రచయిత ఎన్.తిర్మల్, స్పర్ష అద్యయన వేదిక బాస్కర్,న్యాయవాదులు బిచ్చాల తిరుమల రావు,,విప్లవ కుమార్,సి.బాబూరావు,యస్.పూర్ణ చందర్ రావు,రాష్ట్ర రైతుకూలీ సంఘం నాయకులు బండారిఐలయ్య, బజ్జూరి వెంకటరామి రెడ్డి, ప్రకాష్,రాజేంద్ర ప్రసాద్,గిరి,ఖాశీం సుదర్శ న్ మోహన్ రావు, జానకి సంగక సరస్వతి తదితరులు పాల్గొన్నారు. అఖిలబారత రైతుకూలీ సంఘం మహాసభలు జయప్రదం చేయడానికి ఖమ్మం జిల్లా,పట్టణ ప్రజలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు

- **జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఘన నివాళులు అర్పించిన డిసిసి అధ్యక్షులు**



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ గారి 82వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యులు బాలసాని లక్ష్మీనారాయణ, శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా,జిల్లా ఆర్టీఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న , సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ...స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతిని యావత్ భారతదేశ ప్రజలు సద్భావనా దివస్ గా జరుపుకుంటున్నామని"తెలిపారు. దేశంలో మత సామరస్యం, శాంతిని కాపాడటానికి రాజీవ్ గాంధీ పడిన తపన, భారతదేశంలో కంప్యూటర్లు, టెలికాం రంగం అభివృద్ధికి తీసుకువచ్చిన ఆధునిక విధానాలు చిరస్మరణీయమన్నారు. 18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా రాజకీయాలలో యువత భాగస్వామ్యానికి బాటలు వేశారని, స్థానిక స్వపరిపాలన బలపడటానికి, మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి చేసిన చట్ట సవరణలను కొనియాడారు. మనమందరం వారి ఆశయాలను కొనసాగించడానికి వారు చూపిన బాటలో నడవాలని, అదే మనం వారికిచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, విప్లవకుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు తూములూరి లక్ష్మీ నరసింహారావు, కిలారు అనిల్ కుమార్, బచ్చలకూర నాగరాజు, కొట్టే రాజశేఖర్,బండి మాధవరావు, గాదెల ఝాన్సీ,దామా స్వరూప,జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్,వేల్పుల మురళి,కొంటెముక్కల నాగేశ్వరరావు,కిలారు రమణ,కరుణాకర్ రెడ్డి ,ఏలూరి రవికుమార్,యాసిన్ నగర కాంగ్రెస్ నాయకులు దోన్ వాన్ వెంకట్రావు నాయక్, రజి భాయ్,బబ్బారి నరేందర్,కందుల శ్రీనివాస్,చల్లా ప్రతిభారెడ్డి,పర్వత శ్రీనివాస్,రమణ,నారపోగు సుదర్శన్ ,పంది రాజు గౌడ్,నల్లమోతు రవి, ఆసిఫ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఏనుగు నర్సిరెడ్డికి కన్నీటి వీడ్కోలు

- భజనలు.. కోలాటాలు.. డప్పు వాయిద్యాల మధ్య అంతిమయాత్ర -- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన బంధువులు, శ్రేయోభిలాషులు - - ప్రజాసేవలో ప్రత్యేక ముద్ర వేసిన మాజీ సర్పంచ్‌ను కాదు.. తమలో ఒకరిని కోల్పోయామంటూ కన్నీరుమున్నీరైన గ్రామస్థులు



**నల్లగొండ- ఆగస్టు20,తరంగాలు:**
నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎర్రగడ్డగూడెం గ్రామ మాజీ సర్పంచ్ ఏనుగు నర్సిరెడ్డి మృతి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎంతో ఆప్యాయంగా పలకరించే వ్యక్తి ఇక లేరనే విషయాన్ని జీర్ణించుకోలేక గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు కన్నీరుమున్నీరయ్యారు. బుధవారం నిర్వహించిన ఆయన అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని భావోద్వేగంతో తుది వీడ్కోలు పలికారు.
భజనలు, కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ సాగిన అంతిమయాత్ర గ్రామమంతా విషాదంలో ముంచెత్తింది. గ్రామ వీధులన్నీ ప్రజలతో నిండిపోగా, ప్రతి ఒక్కరి కళ్లలోనూ నర్సిరెడ్డిపై ఉన్న అభిమానానికి నిదర్శనంగా కన్నీళ్లు కనిపించాయి. చివరిసారిగా తమ ఆత్మీయుడిని చూసేందుకు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు.
మాజీ సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో ఏనుగు నర్సిరెడ్డి గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో సేవలందించారు. ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి నిరంతరం కృషి చేశారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండడం, ఎవరు సహాయం కోరినా ఆదుకోవడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది.
సర్పంచ్ పదవి ముగిసిన తర్వాత కూడా ప్రజలతో ఉన్న అనుబంధాన్ని కొనసాగిస్తూ తనను ఆశ్రయించిన ప్రతి ఒక్కరికీ తనవంతు సహాయం అందిస్తూ గ్రామానికి ఆత్మీయ నాయకుడిగా నిలిచారు. కులం, మతం, వర్గం, ఆర్థిక స్థితి అనే భేదాలు లేకుండా అందరినీ సమానంగా గౌరవిస్తూ, చిన్నా--పెద్దా అనే తేడా లేకుండా ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకునే వ్యక్తిగా పేరు సంపాదించారు.
ఎవరిని కలిసినా బంధువుల్లా పలకరించే ఆయన స్వభావం గ్రామస్థుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. అందుకే గ్రామ ప్రజలు ఆయనను కేవలం మాజీ సర్పంచ్‌గా కాకుండా ప్రతి కుటుంబంలో ఒక సభ్యుడిగా, ఆత్మీయుడిగా భావించేవారు.
గ్రామంలో ఎవరి ఇంట్లో కష్టం వచ్చినా ముందుండి అండగా నిలవడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెప్పడం, అవసరమైనప్పుడు ఆర్థికంగా, సామాజికంగా సహాయం చేయడం, సమస్య ఏదైనా తనవంతు పరిష్కారానికి కృషి చేయడం ఆయన జీవితంలో భాగమైందని గ్రామస్థులు కన్నీటితో గుర్తు చేసుకున్నారు.
ఆయన చెప్పిన ఆప్యాయమైన మాటలు, ఇచ్చిన భరోసా ఇక వినిపించవనే ఆలోచనే భరించలేకపోతున్నాం. నర్సిరెడ్డి మృతితో గ్రామం ఒక నాయకుడినే కాదు... తమ కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన కుటుంబ సభ్యుడిని కోల్పోయింది” అని పలువురు గ్రామస్థులు భావోద్వేగంతో పేర్కొన్నారు.
అంతిమయాత్రలో పాల్గొన్న పలువురి కళ్లలో కన్నీళ్లు ఆగలేదు. గ్రామ వీధులన్నీ విషాద ఛాయలు అలుముకోగా, భౌతికంగా నర్సిరెడ్డి దూరమైనప్పటికీ ఆయన చేసిన సేవలు, పంచిన ప్రేమ, చూపిన మానవత్వం ఎర్రగడ్డగూడెం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ధైర్యం చెప్పారు. నర్సిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.
ఈ అంతిమయాత్రలో గ్రామస్థులు, బంధువులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులతో పాటు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొని నర్సిరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

## జనసేన పార్లమెంటరీ స్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని జయప్రదం చేయాలి

- -జనసేన పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ వెల్తూరి నగేష్.



**తొర్రూరు తరంగాలు**
మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలో జనసేన పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి వెల్తూరి నగేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని తొర్రూరు పట్టణ కేంద్రంలో విశ్రాంతి భవనం నందు ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది.
ఉమ్మడి వరంగల్ జిల్లా జనసేన పార్టీ ఆత్మీయ సమావేశ ఆహ్వానంజనసేన పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశానుసారం, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మహబూబాబాద్ పార్లమెంట్ మరియు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు జనసైనికులతో ప్రత్యేక ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరుగుతుంది.పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ మరియు ప్రజా సమస్యలపై పోరాటాలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు సమావేశ వివరాలు:తేదీ: 22 ఆగస్టుసమయం: ఉదయం 10:00 గంటలకు వేదిక: శ్రీ హర్ష కన్వెన్షన్ కూడా కాంప్లెక్స్ హనుమకొండ బస్టాండ్ దగ్గరముఖ్య అతిథులు: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తల్లూరి తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జి నేమురి శంకర్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్కె సాగర్ జిల్లా ముఖ్య నాయకులు నియోజకవర్గాల ఇన్చార్జీలు ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని డివిజన్, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు మరియు జనసైనికులు ప్రతి ఒక్కరూ పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నాము.మన ఆలోచనలను పంచుకుందాం... అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు పల్లెర్ల రమేష్ నియోజకవర్గ నాయకులు , పెద్దవంగర మండల అధ్యక్షులు దేశెట్టి వెంకటేష్ మహేష్ రాజు కిరణ్ కుమార్ శ్రావణ్ అశోక్ సతీష్ సాగర్ ఉపేందర్ మోత్కూరి యకాంబరం శివ తదితరులు పాల్గొన్నారు

# ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పోషకాహారమే బలం



- బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్- రాజేంద్రప్రసాద్ రెడ్డి

**నర్సంపేట ప్రతినిధి, ఆగస్టు :20( తరంగాలు)**
పోషకాహారమే ఆరోగ్యానికి పునాది,
విద్యార్థులకు మంచి ఆరోగ్యకరమైన సమతుల్యమైన పోషకాహారాన్ని అందించడంతో పాటుగా వారికి అవగాహన కల్పిస్తే వారి భవిష్యత్తుకు పునాది వేయగలుగు తామని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్రప్రసాద్ రెడ్డి అన్నారు. నర్సంపేట మండలం లోని లక్నేపల్లి లో గల ప్రముఖ విద్యా సంస్థలైన బాలాజీ గ్రూప్ లోని బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ బాలాజీ విద్యా కళాశాలలో గురువారం ఫుడ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడు తాను ఆరోగ్యకరమైన సూత్రాలను పాటిస్తూ విద్యార్థులలో అవగాహన కల్పించాలని అన్నారు .అలాగే ఆహారంలో తప్పని సరిగా శరీర పెరుగుదలకు కావలసిన ఆహార పదార్థాలను సమతుల ఆహారాన్ని తీసుకో వడం పట్ల ఆవశ్యకతను వివరించాలని తెలిపారు. అలాగే నేటి ఆధునిక సమాజంలో చాలావరకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోక పోవడం వల్ల విద్యార్థి దశలోనే పోషకాహార లోపాలు ఏర్పడి వ్యాధి నిరోధక శక్తి తగ్గిపో తుందని అన్నారు. దీంతో విద్యార్థులు పాఠశాలకు సరిగా హాజరు కావడం లేదని, చాత్రోపాధ్యాయు లైన మీరు అవగాహన కలిగి ఉండడమే కాక అందరికీ పోషకాహారం పై శరీరంలో పెరుగుదలకు కావలసిన ఆహార పదార్థాలపై అవగాహన కలిగి ఉంటేనే తర్వాత తరాన్ని ఆరోగ్యకరమైన సమాజాన్ని తయారు చేయవచ్చు అని అన్నారు. మహిళలు వివిధ రకాలైనటువంటి పోషకాహార లోపాలతో దీర్ఘకాలిక అనారోగ్యం పాలవుతున్నారని దీనిని నిర్మూలించా లంటే ముందు జాగ్రత్తగా సమతుల్య ఆహారాన్ని రోజువారి ఆహారంలో చేర్చాలని సూచించారు.అనంతరం విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఏ సందర్భంలో నైనా సరే అనారోగ్య కరమైన పరిస్థితులలో ఏమి తినాలో ఏమి తినకూడదో అవగాహన లేకుండా ఉన్నారని వారికి విద్యార్థి దశ నుంచే పోషక ఆహార నియమాలను పాటించేలా సమతుల్య ఆహారాన్ని అందించేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చాత్రోపాధ్యాయులకు సూచించారు.అనంతరం విద్యార్థులు తయారు చేసిన పోషక ఆహార విలువలతో కూడిన స్టాళ్లను పరిశీలిస్తూ ఆహార పదార్థాలను రుచి చేస్తూ వాటిలో ఉన్న పోషక విలువలను అడిగి తెలుసు కున్నారు. ఈ కార్య క్రమంలో బాలాజీ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఫైండ్ల ప్రసాద్ , బాలాజీ ఎలిమెంటరీ విద్యా కళాశాల ప్రిన్సిపల్ కొండా శ్రీనివాసులు, అధ్యాపకులు గంద్రాతి శ్రీనివాస్, కొత్తపల్లి విజయకుమార్ ,సూరయ్య,దామోదర్ ,రాధిక, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కృషి చేయాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 20,తరంగాలు :**రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలను వర్ధన్నపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. కేవలం 40 ఏళ్ల వయస్సులోనే దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ టెలికాం, ఐటీ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేసిన ఘనత ఆయనదేనన్నారు. నవోదయ విద్యాలయాల ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేశారని తెలిపారు.దేశంలో శాంతి, మత సామరస్యం, సమగ్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ శిభారాణి,రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పాశాల వెంకన్న గౌడ్ , ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి, కిమా నాయక్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రతి బాణుప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తీగల సునీత గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాను నాయక్,లింగం రజిత రెడ్డి,పాక సుజాత, కొండేటి మహేందర్, రామక్రిష్ణ,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దామెర ప్రశాంత్,చిధుముల్ల భాస్కర్,కాంధిక ఎల్లస్వామి,ఎండి సోహేల్,విలసారపు వెంకట్,మరుపట్ల సాయికుమార్,బిర్రు సురేందర్,శివరాత్రి వెంకట్ నర్శిరుపెల్లి కుమారస్వామి,సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఖమ్మం లో భద్రాద్రి కొత్తగూడెం,మహబూబాబాద్ జిల్లాల ఎంపిక చేయబడిన ఉద్యోగులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా రెవిన్యూ అధికారి రామ్మూర్తి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ....ప్రతి ఉద్యోగి ప్రజలకు తమ సేవలను జవాబుదారితనంగా అందించాలని, తమ యొక్క సర్వీస్ లో ప్రతి ఉద్యోగి నిత్యం ప్రభుత్వం నుండి వచ్చే జీవోలను చదివి అర్థం చేసుకొని పాలనలో మెరుగైన ఫలితాలు వచ్చే విధంగా తమ సర్వీస్ ని అందించాలని అన్నారు.ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కంప్యూటర్ నాలెడ్జిని పెంపొందించుకోవాలని ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అర్జీలను తమ స్థాయిలో పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు జరుగుతున్న శిక్షణను తమ యొక్క సర్వీసులో ఉపయోగపడే విధంగా చూసుకోవాలని సేవా తత్వమును అలవర్చుకోవాలని తమ తమ ఆఫీస్ లలో ఫైల్స్ ను పెండింగ్ లేకుండా రోజువారీగా పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి ట్రైనీగా మోహన్ కృష్ణ వ్యవహరించి అనేక రకమైన




జీవోల గురించి సేవా నిబంధన గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ సెంటర్ ఇన్చార్జి ఆదిరాజు కొండలరావు, ఉద్యోగులు ఎర్రమళ్ళ శ్రీనివాసరావు, పాకా సురేష్ , రమేష్ ,భద్రాద్రి కొత్తగూడెం మహబూబాబాద్ జిల్లాల వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ప్రతి మనిషికి ఆధార్ చాలా ముఖ్యం

**• నల్గొండ జిల్లా కేంద్రం, హైద్రాబాద్ రోడ్ లోనూతన ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు.**




నల్గొండ--ఆగస్టు20,తరంగాలు :నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు ఆధార్ సేవా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోండి- రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. ప్రస్తుతం దేశంలో ప్రతి మనిషికి ఆధార్ చాలా ముఖ్యమని, అయితే ఆధార్ లో ఏమైనా సవరణలు , సమస్యలుంటే పరిష్కరించుకునేందుకు నల్గొండ జిల్లా కేంద్రం,హైద్రాబాద్ రోడ్ లో పద్మా నగర్,పాల కేంద్రం వద్ద నూతనంగా ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రం, హైద్రాబాద్ రోడ్ లో పద్మా నగర్,పాల కేంద్రం వద్ద కేంద్ర యుఐడిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్గొండ జిల్లా కేంద్రంలో ఆధార్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషమని,తెలంగాణ లో ఇది 5 వ కేంద్రమని, ఈ కేంద్రం వల్ల జిల్లా ప్రజలతో పాటు,నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు ఆధార్ కు సంబంధించిన ఏ సమస్య ఉన్న పరిష్కరించుకోవచ్చని,ఈ కేంద్రం ఆదివారం కూడా తెరిచి ఉంటుందని తెలిపారు.జిల్లాలో 100 సంవత్సరాలు పైబడిన వారు 200 మంది ఉన్నట్టు జిల్లా కలెక్టర్ ద్వారా తెలిసిందని, సాంకేతిక సమస్య వల్ల వారి పుట్టిన తేదీ తప్పుగా వచ్చిందని, అయితే సంబంధిత తహసిల్దార్ల ద్వారా వారిని నల్గొండ ఆధార్ సేవా కేంద్రానికి పిలిపించి వారి పుట్టిన తేదీ,వయసు సరిచేయాలని కలెక్టర్ కు సూచించారు.



పైసా ఖర్చు లేకుండా, హైదరాబాద్ వెళ్లే పని లేకుండా ఆధార్ లోని సమస్యలను పరిష్కరించుకునేందుకు ఇది చక్కటి అవకాశమని,అందువల్ల జిల్లా ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ యుఐడిఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రంలో ఆధార్ లో ఏమైనా తప్పులు ఉంటే హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా నల్గొండ పట్టణంలోని ఏర్పాటు చేసిన ఆధార్ సేవా కేంద్రానికొచ్చి నిర్దేశించిన రుసుము చెల్లించి సవరణలు చేసుకోవచ్చని తెలిపారు. అప్పుడే పుట్టిన శిశువు మొదలుకొని ,5 సంవత్సరాల వయసు వరకు ఈ ఆధార్ సేవా కేంద్రంలో ఆధార్ కార్డు కు నమోదు చేసుకోవచ్చని, నిర్ణీత పని దినాలు, నిర్మిత వేళల్లో ఈ కేంద్రం పనిచేస్తుందని, అందువల్ల జిల్లాలోని ప్రజలు ఆధార్ సేవా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఈడీఎం దుర్గారావు, యూఐ డి ఐ ఆధార్ సేవ కేంద్రం ఏజెన్సీ ప్రతినిధి భారతి, తదితరులు ఉన్నారు.

జారీ చేసిన వారు సహాయ సంచాలకులు, సమాచార శాఖ నల్గొండ.

# సఖి సెంటర్ ఆవరణ లో ఉపేంద్ర బాయి పై దౌర్జన్యం

**• కలెక్టర్ కార్యాలయంలో డి ఆర్ ఒ రామ్మూర్తికి ఫిర్యాదు**



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : ఖమ్మం : వీర నారీమణుల ఆశయ సాధన సమితి ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు భూ ఖ్య ఉపేంద్ర బాయి పై ఖమ్మం సఖి సెంటర్ ఆవరణలో ఇటీవల జరిగిన దౌర్జన్యం పై గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఉపేంద్ర బాయి మాట్లాడుతూ ఒక బాధితురాలి అంశంపై సఖి సెంటర్ కు వెళ్ళగా అక్కడ బాధితురాలి భర్త ఇస్మాయిల్, పువ్వాడ ఉదయ నగర్ సర్పంచ్ షేక్.సిద్ధికి , సర్పంచ్ అనుచరుడు వడ్లకుంట శివ ఉన్నారు. బాధితురాలు షేక్. జాహేదా బేగం తన భర్త ఇస్మాయిల్ మధ్య జరుగుతున్న వివాదంపై ఖమ్మం జిల్లా కలెక్టర్కు గతంలో ఫిర్యాదు చేయగా ఖమ్మం సఖి సెంటర్ కు ఈ కేసును రిఫర్ చేశారు. ఈ క్రమంలో సఖి సెంటర్ వద్దకు వెళ్లగా ఇస్మాయిల్ తనపై దౌర్జన్యానికి దిగడమే కాకుండా అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషించడం జరిగింది. మాట మాట పెరిగిన నేపథ్యంలో ఇస్మాయిల్ తనపై భౌతిక దాడి కీ , సఖి సెంటర్ అధికారుల ఎదుటనే యత్నించాడని ఆరోపించారు. ఇదే సందర్భంగా గతంలో తనపై తనకు తాను సిపిఐ నాయకుడిగా చెప్పుకునే వ్యక్తి యాకోబ్ పై తాను గతంలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా ఈ అంశం కూడా సఖి సెంటర్ కు జిల్లా కలెక్టర్ పంపించారని , దీనిపై విచారణ కూడా నిర్వహించిన సఖి అధికారులు, ఈ అంశంపై ఇంతవరకు నిందితుడి పై ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రఘునాధపాలెం పోలీస్ స్టేషన్లో కూడా యాకుబ్ పై ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించిన చర్యలు లేకపోవడంతో జిల్లా కలెక్టర్ ను సంప్రదించడం జరిగిందని, ఆ నేపథ్యంలోనే సఖి సెంటర్ కు ఈ కేసును పంపించడం జరిగిందని వివరించారు .ఈ అంశాలపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ , రాష్ట్ర డిజిపి,రాష్ట్ర మహిళ కమిషన్ , ఎస్సీ, ఎస్టీ కమిషన్ లకు కూడా ఫిర్యాదు చేశామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్ర బాయి తో పాటు వీర నారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా నాయకులు ఏ. సరోజని, నల్ల నాగమణి , రేణుక తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర





**.ఇల్లందు ప్రతినిధి, ఆగస్ట్ 20,( తరంగాలు) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా గురువారం ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో గల ప్రభుత్వ యు.పి.ఎస్ పాఠశాల ఆవరణలో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర మొక్కలు నాటి, విద్యార్థులతో కలిసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెట్లు లేకపోతే మానవ మనుగడే లేదని అన్నారు. మొక్కలు పెంచడం వలన వర్షాలు సమృద్ధిగా పడతాయని, కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. మొక్కలు కార్బన్ డై ఆక్సైడ్ ను గ్రహించి ప్రాణవాయువు అయిన ఆక్సిజన్ ను విడుదల చేస్తాయని, అందుకే ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దానిని తమ బిడ్డలా సంరక్షించాలని పిలుపుని చ్చారు. విద్యార్థులు చిన్న వయస్సు నుండే పర్యావరణంపై ప్రేమను పెంచుకోవాలని సూచించా రు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సందీప్ మాట్లాడుతూ, పట్టణాన్ని హరిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ శాఖ కృషి చేస్తుందని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ కోర్లపాటి శివ కిరణ్, 1వ వార్డు కౌన్సిలర్ సైదా మియా, పట్టణ మహిళా అధ్యక్షురాలు స్వరూప, మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ అతహర్, పాఠశాల ఉపాధ్యాయులు జి. భాగ్యరాజు, వినోద, మల్లేశ్వరి, కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ కోరి, సతీష్, విద్యార్థులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేటలో ఉచిత పోలీస్ కోచింగ్ ఏర్పాటు చేయాలి

**• ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్ డిమాండ్**



**నర్సంపేట ప్రతినిధి, ఆగస్టు 20 (తరంగాలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ నియామకాల నేపథ్యంలో నర్సంపేట నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వమే ఉచిత పోలీస్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఖానాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ దాసరి రమేష్ డిమాండ్ చేశారు.గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి యువత ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో వేలాది రూపాయలు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉద్యోగాల కోసం పోటీపడుతున్న యువతను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండుసార్లు పోలీస్ నియామకాలు చేపట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అప్పటి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి తన సొంత ఖర్చుతో రెండు దఫాలుగా 800 మంది నిరుద్యోగ యువతకు ఉచిత మెటీరియల్, భోజన సదుపాయం కల్పించి, 45 రోజుల పాటు ఉచిత కోచింగ్ ఇప్పించారని తెలిపారు. అందులో దాదాపు 140 మంది యువత ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు.అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రస్తుత ప్రభుత్వం నర్సంపేట నియోజకవర్గంలో ఉచిత పోలీస్ కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఫిజికల్ టెస్టులు, రాత పరీక్షలకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ అందించడంతో పాటు స్టడీ మెటీరియల్‌ను కూడా ఉచితంగా అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ విషయంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి నర్సంపేట నియోజకవర్గ నిరుద్యోగ యువతకు అండగా నిలవాలని దాసరి రమేష్ కోరారు.

# రైతులకు అన్యాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- బిజెపి జిల్లా నాయకులు కుందురూ మహేందర్ రెడ్డి



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 20,తరంగాలు :** వర్షాలు లేక పంటలు ఎండిపోతూ ఉంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా అన్యాయం చేస్తుందని మహేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. కష్టకాలంలో రైతులకు దేవాదుల మరియు ఎస్ ఆర్ ఎస్ పి కాలువల ద్వారా పంటలకు నీరు అందించకుండా నిర్లక్ష్యం వహిస్తూ రైతుల బాధలను విస్మరించి అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు గాలికి తిరుగుతున్నారని ఆరోపించారు. దేవాదుల కెనాల్ ద్వారా వర్ధన్నపేట నియోజకవర్గం లోని చాలా మండలాలకు నీరు అందాల్సి ఉండగా ఇప్పటివరకు వర్ధన్నపేట మండలానికి చుక్క నీరు ఇవ్వకుండా మండల రైతులను ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే నిర్లక్ష్యం చేస్తున్నారని మహేందర్ రెడ్డి అన్నారు. వర్షాలు పడతాయని ఆశతో పంటలు వేసుకొని వేల రూపాయలు ఖర్చు చేసి విత్తనాలు మరియు ఎరువుల కొనుగోలు చేసి పంటలు వేస్తే అవి ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతన్నలు బోరున విలపిస్తున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆయన అన్నారు. అలాగే ప్రభుత్వం ఆగస్టు 14వ తేదీన రైతు బీమా పథకం కోసం చెల్లించాల్సిన ప్రీమియం చెల్లించకుండా రైతులకు ఉన్న బీమా సౌకర్యాన్ని కూడా వారికి అందకుండా చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతన్నలకు అన్యాయం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మరియు స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోని నియోజకవర్గం లోని అన్ని గ్రామాలకు ఎస్సారెస్పీ మరియు దేవాదుల నీటిని అందే విధంగా చర్యలు తీసుకొని రైతన్నల పంటలు కాపాడే విధంగా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే రాజకీయాలకు అతీతంగా రైతన్నలను అందర్నీ కలుపుకొని ధర్నాలు, నిరాహార దీక్షలు చేపడుతామని మహేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ప్రజలకు చేరువగా అనేక యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కీ హన్మకొండ సీఐ కి దక్కిన ప్రశాంసా పత్రం



గత జూన్ నెలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో విస్తృతంగా ఆంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కల్పించడం, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించడం, డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం వంటి అంశాలపై వివిధ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

ఈ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా పలువురు పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా అధికారుల పనితీరు, కార్యక్రమాల నిర్వహణలో చూపిన చొరవ, ప్రజలు మరియు విద్యార్థులను భాగస్వామ్యం చేయడంలో చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అత్యుత్తమంగా పనిచేసిన టాప్-10 పోలీస్ స్టేషన్ ఎస్ హెఛ్ ఓ ను ఎంపిక చేయడం జరిగింది. ఈ టాప్-10 జాబితాలో హన్మకొండ పోలీస్ స్టేషన్ ఎస్ హెఛ్ ఓ మచ్చ శివకుమార్ కూడా ఎంపిక కావడం జరిగింది. హన్మకొండ పరిధిలో విద్యార్థులు, యువత మరియు ప్రజల్లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు వివిధ ప్రాంతాల్లో, విద్యాసంస్థల్లో మరియు ప్రజలకు చేరువగా అనేక యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాలను నిర్వహించడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపడం జరిగింది. ఈ సందర్భంగా ఈరోజు హైదరాబాద్‌లోని కమాండెంట్ కంట్రోల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య చేతుల మీదుగా ఎస్ హెఛ్ ఓ హన్మకొండ.సిఐ మచ్చ శివకుమార్ మరియు సీసీరబీ ఏసీపీ డేవిడ్ రాజ్ కి ప్రశంసా పత్రంతో పాటు క్యాష్ రివార్డు అందజేయడం జరిగింది. డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా హన్మకొండ పోలీస్ స్టేషన్ చేసిన కృషికి ఈ గుర్తింపు ఒక ప్రత్యేక అభినందనగా నిలిచింది. భవిష్యత్తులో కూడా యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు, ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగించేందుకు ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుంది.

# 5 గ్రామాలను తెలంగాణలో కలపండి

- దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో తెలంగాణ సమస్యలపై మంత్రి తుమ్మల విజ్ఞప్తి




**తరంగాలు, ఖమ్మం జిల్లా బ్యూరో, ఆగస్టు 20:** మహాబలిపురంలో గురువారం జరిగిన 31వ దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో తెలంగాణకు సంబంధించిన పలు కీలక సమస్యలను వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రస్తావించారు. సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి తుమ్మల పలు వినతిపత్రాలు సమర్పించారు. ముఖ్యంగా భద్రాచలం సమీపంలోని ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఉన్న ఏటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 19 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని తెలిపారు.ప్రస్తుతం ఈ ప్రాంతాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉండటంతో ప్రజలు పరిపాలనాపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తుమ్మల పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ జిల్లా కేంద్రం సుమారు 282 కిలోమీటర్ల దూరంలో ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉందని వివరించారు. గ్రామాలను తెలంగాణలో విలీనం చేస్తే ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని అన్నారు.

**పెద్దవాగు ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలి**

జూలై 2024లో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పెద్దవాగు సాగునీటి ప్రాజెక్టును శాశ్వతంగా పునరుద్ధరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయాలని మంత్రి తుమ్మల, సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. ప్రాజెక్టు పునరుద్ధరణకు సుమారు రూ.92.20 కోట్ల వ్యయం అవుతుందని తెలిపారు.

**ఆయిల్‌పామ్ గెలలకు రూ.25 వేల ధర**

ఆయిల్‌పామ్ తాజా గెలలకు టన్నుకు కనీసం రూ.25,000 ధరకు హామీ ఇవ్వాలని తుమ్మల డిమాండ్ చేశారు. ఈ అంశంలో కేంద్ర ప్రభుత్వం వద్ద ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**భద్రాచలం--ఏలూరు రహదారికి జాతీయ హోదా**

చింతలపూడి, దమ్మపేట మీదుగా వెళ్లే భద్రాచలం--ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

అమిత్ షా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి తెలంగాణ తరపున ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# జనసేన ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

-జనసేన పోస్టర్ ఆవిష్కరించిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బర్ల శివ

**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 20, తరంగాలు :** జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని, పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల 22న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జనసేన పార్టీ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బర్ల శివ పిలుపునిచ్చారు.వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో గురువారం జనసేన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్‌ను బర్ల శివ ఆవిష్కరించారు. అనంతరం బర్ల శివ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి జనసేన సైనికుడిపై ఉందన్నారు.జిల్లా కేంద్రంలో జరగనున్న ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు చేపట్టాల్సిన కార్యక్రమాలపై రాష్ట్ర నాయకులు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రాంతాలూరు,



ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్ నాయుడు తదితర ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి జనసేన వీర మహిళలు, జనసేన సైనికులు, ముఖ్య కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బర్ల శివ కోరారు. పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు ఆత్మీయ సమ్మేళనం ఒక వేదికగా నిలుస్తుందని ఆయన అన్నారు.కార్యకర్తల ఐక్యత, సమష్టి కృషితో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహం పెట్టడానికి పర్మిషన్ తీసుకోవడం చేతగాని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులకు ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి గురించి మాట్లాడే అర్హత లేదు..

- ఏఎంసి వైస్ చైర్మన్ - శాఖమూరి హరిబాబు
- అధికారులు విగ్రహం కూల్చివేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టి బొమ్మలను దగ్ధం చేయడం సిగ్గుచేటు
- పి ఏ సి ఎస్ చైర్మన్- వల్లె శ్రీను

**నర్సంపేట ప్రతినిధి , ఆగస్టు :20 (తరంగాలు )** మాజీ ఎమ్మెల్యే పెద్ది విగ్రహం పెట్టడానికి పర్మిషన్ తీసుకోవడం చేతగాని నాయకులు పెట్టిన విగ్రహాన్ని అధికారులు కూల్చివేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దిష్టి బొమ్మలు దహనం చేయడం బిఆర్ఎస్ పార్టీ నాయకుల కార్యకర్తల అనైతిక ఆలోచనలకు నిదర్శనం అని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు,ఖానాపురం ప్రాథమిక సహకార సంఘం సొసైటీ చైర్ పర్సన్ వల్లె శ్రీను బిఆర్ఎస్ పార్టీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి హరిబాబు, శ్రీను మాట్లాడుతూ గత రెండు మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలను నియోజకవర్గ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే నేర్పిన సంస్కృతితో వేచి చూస్తున్నామని తెలుపుతూ, ఇకనుంచి ఎమ్మెల్యే జోలికి గాని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తల జోలికి వస్తే ఖబర్దార్ బిఆర్ఎస్ పార్టీ నాయకుల్లారా అని హెచ్చరించారు. విగ్రహం పెట్టడానికి పర్మిషన్ తీసుకోవడం చేతకానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు మాట్లాడే అర్హత లేదని



తెలుపుతూ, పర్మిషన్ లేకుండా పెట్టిన విగ్రహాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రమేయం లేకుండా అధికారులు కూల్చివేస్తే నియోజక వర్గ ఎమ్మెల్యే దిష్టి బొమ్మలను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దగ్ధం చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇకనుంచి కాంగ్రెస్ పార్టీ జోలికి వస్తే బిఆర్ఎస్ పార్టీ నాయకులను ఉరుకునేది లేదని హెచ్చరించారు. పేదలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందే విధంగా ఉండాలని లక్ష్యంతో కోట్ల రూపాయల విలువగల భూమిని మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం దాత భూదానం చేస్తే దానిలోని రెండు ఎకరాల భూమిని మాజీ మున్సిపల్ చైర్మన్ నాగేల్లి వెంకటనారాయణగౌడ్, స్వప్నల పేరు మీద ఏ విధంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పేదల కోసం ఉచితంగా ఇచ్చిన భూమిని కూడా బిఆర్ఎస్ పార్టీ నాయకులు వదలలేదని వారు ఆధారాలతో మాట్లాడుతున్నట్లు తెలుపుతూ పేద ప్రజల కోసం కోట్ల విలువ చేసే భూమిని మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం ప్రభుత్వానికి అందజేసిన దాతల విగ్రహాలను ఏర్పాటు చేయడంలో బిఆర్ఎస్ పార్టీ విఫలమయిందని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ డివిజన్ అధ్యక్షుడు యడ్ల బిక్షంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే ముస్తాఫా, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్, బ్లాక్ సభ్యుడు గిరగాని నరసయ్య, సర్పంచులు బోడ రమేష్, జాటోత్ వినోద్ కుమార్, మూడు దేవేందర్, ఉప సర్పంచ్లు ఆరె సంపత్ కుమార్, కొనుకటి రాజు, వార్డు సభ్యుడు శాఖమూరి ముఖేష్ చౌదరి, సొసైటీ డైరెక్టర్స్ శివరాత్రి వెంకన్న, బొబ్బ విద్యాసాగర్ రావు, జటంగి నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షులు లింగిడి వెంకటేశ్వర్లు, పిండి కుమార్, నవీన్, రాజు, రమేష్, నాయకులు రెడ్డి నాగార్జునరెడ్డి, కోరె రాములు, మూడు పూల్ సింగ్, ఎస్కే లాల్ సాబ్, ముదురు కుమారస్వామి, మారగాని లింగయ్య, గుడిసె సూరయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తరంగాలు

# రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించాలి






- **ఏఎంసీ చైర్మన్ గంట, మండల అధ్యక్షులు సమ్మిగౌడ్**

**కేసముద్రం ప్రతినిధి, ఆగస్టు 20,తరంగాలు :** రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మండల అధ్యక్షులు చిలువేరు సమ్మిగౌడ్ అన్నారు.కేసముద్రం మున్సిపాలిటీ మార్కెట్‌లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి, యువ నాయకుడు రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.అనంతరం ఏఎంసీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ యువతపై నమ్మకంతో ఓటు హక్కు వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి ప్రజాస్వామ్యంలో యువతకు భాగస్వామ్యం కల్పించారని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, నూతన విద్యా విధానం, ఐటీ, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు.అత్యంత చిన్న వయస్సులోనే ప్రధాని అయ్యిన ఘనత మన రాజీవగాంధీ గారిది అని,దేశ అభివృద్ధి, పేదల సంక్షేమం,యువతకు అవకాశాల కల్పనలో రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన చూపిన దూరదృష్టి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. శ్రీలంకలో శాంతి స్థాపనకు కృషి చేసిన రాజీవ్ గాంధీ 1991లో శ్రీపెరంబుదూరులో ఎల్‌టీటీఈ మానవ బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు.నవ భారత నిర్మాణానికి కంప్యూటర్ యుగాన్ని పరిచయం చేసి ఈ రోజు భారతదేశ యువత ప్రపంచ నలుమూలల అగ్రగామి లో ఉండేలా చేసిన ఘనత రాజీవ్ గాంధీది అని గుర్తుచేశారు.రాజీవ్ గాంధీ ఆశయాలు, సద్భావన, ఐక్యత, యువత సాధికారతను కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత వెంకన్న , పాక్స్ వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి , కౌన్సిలర్లు వల్లందాసు ఉమా రవి,సునీత బధ్యానాయక్, రాంబాబు, రడం వెంకన్న, రడం శ్రీనివాస్, తరాల వీరేష్, దామరకొండ ప్రవీణ్, సామల నర్సయ్య,వసంత రావు,ఆరిద్రపు కుమార్, పార్వతి, ప్రభావతి,మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు,గ్రామ పార్టీ అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ శాఖ నాయకులు, యువజన, మహిళా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు, పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత




వరంగల్ ప్రతినిధి, ఆగస్టు 20,తరంగాలు : వరంగల్ ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు.వరంగల్ ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ భరద్వాజ్‌తో పాటు రోడ్లు, భవనాలు, మున్సిపల్, ట్రాఫిక్ విభాగాల అధికారులు, ట్రైసిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ల అధికారులు హాజరయ్యారు.సమావేశంలో ట్రాఫిక్ పోలీస్ అధికారులు నగరంలో తరచుగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రస్తుతం నగరంలో ఉన్న ట్రాఫిక్ సిగ్నళ్ల పనితీరు, వరంగల్, హన్మకొండ, కాజీపేట ప్రాంతాల్లో కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన జంక్షన్లు, ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న రోడ్లపై ఆక్రమణలు, తొలగించాల్సిన టెలిఫోన్ మరియు విద్యుత్ స్తంభాలు, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, రోడ్డు మరమ్మతులు, యూ–టర్నింగ్ ప్రాంతాల్లో సోలార్ బ్లింకర్లు ఏర్పాటు, ఆటో స్టాండ్లకు అనువైన ప్రదేశాల గుర్తింపు తదితర అంశాలపై అధికారులు చర్చించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు కూడా అధికారులు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ట్రైసిటీ పరిధిలో రాత్రి సమయాల్లో వెలుతురు సరిగా లేని 159 ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు చొరవ చూపాలని సూచించారు. అదేవిధంగా ప్రమాదకర ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, రోడ్డు మలుపులు, అనధికార పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చోట్ల ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ అధికారులు సూచించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించడం ద్వారా ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలను మరింత స్పష్టంగా గుర్తించవచ్చని పేర్కొన్నారు.

సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, హన్మకొండ ఏసీపీ నర్సింరావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణతో పాటు ట్రాఫిక్ విభాగం అధికారులు, ట్రైసిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఐటికోర్, టి టి ఐ ఇన్స్ స్పెక్టర్లు , మున్సిపల్, ఆర్ అండ్ బి పాల్గొన్నారు.



# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- **వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 20 (తరంగాలు):** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ ఏదో ఒక రూపంలో అందుతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం వర్ధన్నపేట మున్సిపాలిటీకి చెందిన పెన్మటెచ్చా సురేష్‌కు సీఎం సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 1.75 లక్షల విలువైన చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్‌ఎఫ్ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్‌లో ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్య ఎదురైనా తనను లేదా తన కార్యాలయాన్ని వెంటనే సంప్రదించాలని లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.పథకాల ప్రయోజనాలను నేరుగా అర్హులైన వారి ఇంటి వద్దకే చేరవేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ షిభారాబి రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పొశాల వెంకన్న గౌడ్ , ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి, కిమా నాయక్,లింగం రజిత, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## నాణ్యతలో రాజీ పడొద్దు :వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

- కోనారెడ్డి చెరువు అభివృద్ధికి రూ.3.14 కోట్ల నిధులు



**వర్ధన్నపేట ప్రతినిధి, ఆగస్టు 20,తరంగాలు** : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని కోనారెడ్డి చెరువు అభివృద్ధి పనులకు గురువారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. రూ. 3.14 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.చెరువు అభివృద్ధి పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యత ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీపడకూడదని ఎమ్మెల్యే సూచించారు. పనులను త్వరగా పూర్తి చేసి వచ్చే ఏడాది కల్లా కాలువల ద్వారా రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ షిభారాణి రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పొశాల వెంకన్న గౌడ్ , ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి, కిమా నాయక్, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వందేమాతరంపై రాజకీయ వివాదం

- కాంగ్రెస్ తీరును ఎండగట్టిన బిజెపి
- కొత్త ముస్లింలీగ్ పార్టీ అంటూ నితిని నబీన్ విమర్శలు

న్యూఢిల్లీ,ఆగస్ట్20: జాతీయ గేయం 'వందే మాతరం' విషయంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. పార్టీ కార్యక్రమాల్లో వందే మాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న తమ 1937 నాటి నిర్ణయానికే కట్టుబడి ఉంటామని కాంగ్రెస్ స్పష్టం చేసింది. మరోవైపు కాంగ్రెస్ నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ నిర్ణయం ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తు తోందని ఆరోపించింది. వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని నిర్ణయించిన కాంగ్రెస్‌పై భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర విమర్శలు చేశారు. ఓట్ల కోసం కాంగ్రెస్ 'కొత్త ముస్లిం లీగ్'గా మారిందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో తీవ్రస్థాయిలో స్పందించారు. వందేమాతరాన్ని అవమానించడం దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను అవమానించడమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. 1937లో కాంగ్రెస్ తీసుకున్న తీర్మానాన్ని అనుసరించాలని సీడబ్ల్యూసీ నిర్ణయించింది. ఇకపై పార్టీ కార్యక్రమాల్లో వందేమాతరం తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని స్పష్టం చేసింది. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం పూర్తి రూపాన్ని ఆలపించే విషయంలో చోటుచేసుకున్న వివాదాన్ని నబీన్ పరోక్షంగా ప్రస్తావించారు. వందేమాతరంపై తన వైఖరిని కాంగ్రెస్ తీర్మానం రూపంలో అధికారికం చేసిందన్నారు. ఓటు బ్యాంకు కోసం దేశ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పదేపదే తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ఇది కేవలం రాజకీయ సమర్థన కాదని, ఓటు బ్యాంకు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది మాట్లాడుతూ.. వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తామే వారసులమని చెప్పుకునే కాంగ్రెస్ ఇప్పుడు జాతీయ గేయాన్ని పూర్తిగా గౌరవించేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగం, పార్లమెంట్, దేశం కంటే పార్టీ నిర్ణయానికే కాంగ్రెస్ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్‌ను తీవ్ర పదజాలంతో విమర్శిం చారు. కాంగ్రెస్ తీరు చారిత్రక ముస్లిం లీగ్ వైఖరిని గుర్తుకు తెస్తోందని, ఆ పార్టీ కొత్త ముస్లిం లీగ్‌గా మారిందని ఆరోపించారు.

# ఎస్సీ,ఎస్టీల హక్కుల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు







- సమస్యలు లేని జిల్లాగా జిల్లా యంత్రాంగం కృషి
- అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి
- రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**వరంగల్ ప్రతినిధి , ఆగస్టు 20, తరంగాలు :** ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, ఆర్ఓఆర్, అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను ఆయా వర్గాల ఆవాసాలు, సంక్షేమం, అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని, నిధులను పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, కుసుమ నీలాదేవిలతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, సీపీ శ్వేత, డీసీపీ అంకిత్ కుమార్, ఐటీడీఏ పీవో లెనిన్ వాత్సల్ టోప్పో, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై.వి.గణేష్ తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, ఆర్ఓఆర్, ఉద్యోగుల పదోన్నతులు, రోస్టర్ రిజర్వేషన్లు, ఉప ప్రణాళిక నిధుల వినియోగం, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇచ్చిన "సమీకరించు.. బోధించు.." అనే సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఎస్సీ, ఎస్టీలకు తమ హక్కులపై అవగాహన కల్పించాలని అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ప్రజల సమస్యలను కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

### అట్రాసిటీ కేసులపై ప్రత్యేక దృష్టి

ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసుల్లో పోలీసులు, రెవెన్యూ తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ సూచించారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల పురోగతిని సమీక్షించారు. కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం అందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. పెండింగ్ కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

### ప్రమోషన్లలో రోస్టర్ రిజర్వేషన్ తప్పనిసరి

ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు నియమకాలు మరియు పదోన్నతులు , కల్పించే సమయంలో రోస్టర్ రిజర్వేషన్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. రిజర్వేషన్ అమలులో నిర్లక్ష్యం చేయకూడదని, ఉద్యోగుల రాజ్యాంగపరమైన హక్కులకు భంగం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### బాధితులకు పరిహారంతో పాటు పునరావాసం

హత్య, అత్యాచారం వంటి తీవ్రమైన నేరాలకు గురైన ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలను కేవలం పరిహారంతో వదిలేయకుండా పునరావాసంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. అర్హులకు నిబంధనల ప్రకారం పరిహారం అందించడంతో పాటు అవసరాన్ని బట్టి ఉపాధి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, గృహ వసతి, పునరావాస సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డే

ప్రతి నెల గ్రామస్థాయిలో నిర్వహించే సివిల్ రైట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలని చైర్మన్ ఆదేశించారు. తహశీల్దార్లు, ఎస్ఐలు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ఎస్సీ, ఎస్టీల హక్కులు, చట్టపరమైన రక్షణలు, సంక్షేమ పథకాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ కమిషన్ సూచించిన విధంగా సివిల్ రైట్స్ డే రోజున అధికారులు తప్పనిసరిగా పాల్గొని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సివిల్ రైట్స్ డే సందర్భంగా సహపంక్తి భోజనం ఏర్పాటు చేసేలా అధికారులకు దిశానిర్దేశం చేస్తామని చెప్పారు.సీపీ శ్వేత మాట్లాడుతూ జిల్లాలో కేసుల నియంత్రణ, పరిష్కారంలో పోలీసు యంత్రాంగం ముందుండి పని చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలపై జరిగే అఘాయిత్యాల కేసుల్లో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని చైర్మన్ సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.విదేశీ విద్య, బాధితులకు పరిహారం, కులాంతర వివాహాల ప్రోత్సాహక చెల్లింపులకు సంబంధించి పెండింగ్ వివరాల నివేదికను అందించాలని ఎస్సీ అభివృద్ధి అధికారిని ఆదేశించారు.

### సమన్వయంతోనే మెరుగైన ఫలితాలు

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా స్థాయిలో అధికారుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి క్షేత్రస్థాయిలో పథకాల అమలును పర్యవేక్షించాలని సూచించారు.అనంతరం కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రజల నుంచి గ్రీవెన్స్‌లను స్వీకరించారు. అనంతరం కమిషన్ చైర్మన్, సభ్యులకు జిల్లా కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయలక్ష్మి,



డీబీసీడీఓ, ఇన్‌చార్జి డీఎస్సీడీఓ పుష్పలత, జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, సంబంధిత జిల్లా అధికారులు, వివిధ మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు భూక్య హుస్సేన్ నాయక్, పాలకుర్తి విజయ్ కుమార్, బిర్రు మహేందర్, మహంకాళి యాదగిరి, రైతు రమేష్ కుమార్, వాసం సాంబయ్య, రాజేందర్, నమిడ్ల చిన్నస్వామి, కల్లెపు శోభారాణి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



## ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి

### అడ్మిన్ శ్రీనివాసరెడ్డి నివాసంలో సోదాలు

హైదరాబాద్,ఆగస్ట్20 ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి చిక్కారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీపట్నం ఆర్డీవో కార్యాలయంలో అడ్మిన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఉదయం నుంచి ఏసీబీ సోదాలు కొనసాగాయి. హస్తినాపురం డివిజన్ పరిధిలోని సంతోషిమాత కాలనీలో ఉన్న శ్రీనివాస్ రెడ్డి నివాసంతో పాటు 15 చోట్ల ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఆస్తులు, పత్రాలు ఇతర కీలక ఆధారాలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. శ్రీనివాస్‌రెడ్డి గతంలో మహేశ్వరం తహశీల్దార్‌గా పనిచేశారు.

## కొండా సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఆగ్రహం

### ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరిక

### సుష్మిత మాటలు జాగ్రత్త అంటూ హెచ్చరించిన ఇందిరా శోభన్

హైదరాబాద్,ఆగస్ట్20 మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పార్టీలోని అంతర్గత పరిణామాలను లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి గతంలో తమ ఇంటికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అప్పట్లో ఆయనకు ఇచ్చిన గౌరవాన్ని గుర్తుచేశారు. సీఎం పదవిలో ఉన్నంత మాత్రాన ఎవరిని పడితే వారిని తక్కువ చేసి మాట్లాడకూడదని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం సరికాదని ఆమె ఘాటుగా స్పష్టం చేశారు. దీంతో పాటు.. రాజకీయాల్లో తన సొంత భవిష్యత్తుపై స్పష్టతనిస్తూ వచ్చే శాసనసభ ఎన్నికల్లో పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తనకు పూర్తి అర్హతలు ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశిస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. పార్టీ స్థాపన, అభివృద్ధిలో తమ కుటుంబం చేసిన త్యాగాలను వివరిస్తూ, తమకు జరుగుతున్న అన్యాయంపై మౌనంగా ఉండేది లేదని తెలిపారు. అవసరమైతే ఏ స్థాయికైనా వెళ్లి పోరాడతానని సీఎం వర్గానికి, పార్టీ నాయకత్వానికి ఆమె స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈ వ్యాఖ్యలు సొంత పార్టీలోనే కాక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయి.తాజాగా దీనిపై గాంధీ భవన్‌లో కాంగ్రెస్ మహిళా నేతలు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్, కొండా సుష్మితపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'సుష్మితా.. మాటలు జాగ్రత్త' అంటూ హెచ్చరించిన ఆమె, సుష్మిత వైఖరిని, ప్రవర్తనను పూర్తిగా తప్పుబట్టారు. కొండా సురేఖ తమ అక్క కాబట్టి, ఆ బంధాన్ని గౌరవిస్తూనే కొండా సుష్మితకు ఒక అక్క కూతురిగా మర్యాద ఇస్తున్నామని చెప్పారు. అయితే అసలు సుష్మిత పార్టీలో ఉందా లేదా అన్నది స్పష్టం చేయాలని సూచించారు. ప్రస్తుత ఎమ్మెల్యేల గురించి ముఖ్యమంత్రి మాట్లాడకపోతే ఇంకెవరి గురించి మాట్లాడతారని ప్రశ్నిస్తూ, పార్టీ లైన్‌లో ఉండి పని చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. సుష్మిత మాట్లాడే తీరు ఆమె తల్లిదండ్రుల పెంపకాన్నే ప్రశ్నించేలా ఉందని ఇందిరా శోభన్ వ్యాఖ్యానించారు. సినిమాలు చూసి డ్యామేజీ సింపుల్ డైలాగులు కొట్టడం రాజకీయాల్లో నడవదని స్పష్టం చేశారు. సుష్మిత వెనక ఉండి బీఆర్ఎస్ లేదా బీజేపీ నేతలు ఇలా మాట్లాడిస్తున్నారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. మంత్రి పదవి తన తల్లికి దక్కిందంటే అది ఆమె కుటుంబానికి, సామాజిక వర్గానికి వచ్చిన గౌరవమే కదా అని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి కుటుంబానికి సంబంధించి ఏ పదవులు లేకపోయినా, వారిని వివాదాల్లోకి గురిచేయడం సరికాదన్నారు. గతంలోనే కొండా సురేఖ ఒకసారి క్షమాపణలు చెప్పారని, ఇప్పుడు మళ్లీ ఇలాంటి వివాదాలు సృష్టించడం వల్ల పక్క పార్టీలకే అవకాశం ఇచ్చినట్లవుతుందని మండిపడ్డారు. ఎవరికైనా చిట్టా ఉంటే దానిని దర్యాప్తు సంస్థలకు ఇవ్వాలని, ఊరికే బెదిరింపులకు దిగకూడదని అన్నారు. పొలిటికల్ మెచ్యూరిటీ లేకుండా మాట్లాడుతున్నారని, రేవంత్ రెడ్డి అభిమానులు ఇలాంటి వ్యాఖ్యలను చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కౌంటర్ ఇస్తే మరింత రెచ్చిపోతానని సుష్మిత అంటున్నారని, అలా రెచ్చిపోతే పుచ్చిపోతావని గట్టిగా హెచ్చరించారు. పార్టీ కోసం ఎంతో కష్టపడిన కార్యకర్తలకు పదవులు అడగాలి తప్ప, తనేం చేసిందని ఎమ్మెల్యే పదవి కోరుతోందో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం తగదని, ఇకనైనా సుష్మిత తన తాటాకు చప్పుళ్లు కట్టిపెట్టి ప్రవర్తన మార్చుకోవాలని స్పష్టం చేశారు.

## భారీగా పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ,ఆగస్ట్20: అమెరికా ట్రెజరీ బాండ్ దిగుబడులు తగ్గడం, డాలర్ బలహీనపడటం వంటి కారణాలతో దేశీయంగా బంగారం ధరలు భారీ పెరుగుదల నమోదు చేశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై మార్కెట్ అంచనాలు కూడా బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,270గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.4300 మేర పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,46,000గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.3950 మేర పెరిగింది. మరోవైపు వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలోకు రూ.10 వేల మేర పెరుగుదల నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది.

## మహిళ కడుపులో గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్

### ప్రసవం కోసం వెళ్లిన సమయంలో నిర్లక్ష్యంగా సర్జరీ

ముంబై,ఆగస్ట్20 ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లిన 19 ఏళ్ల మహిళకు డాక్టర్ల నిర్లక్ష్యం శాపంగా మారింది. ఆపరేషన్ చేసిన తర్వాత ఆమె కడుపులోనే గ్లౌజ్‌లు, పేపర్ వైప్స్ వదిలేసి కుట్టేశారు. ఈ ఘటన మహారాష్ట్రలో కలకలం రేపింది. తీవ్ర కడుపునొప్పి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. ఈ ఘటనపై ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించింది. వడ్వాణి గ్రామానికి చెందిన సంధ్య ఆగస్టు 1న ప్రసవం కోసం బీడ్ జిల్లా ఆస్పత్రిలో చేరారు. అదే రోజు సాయంత్రం ఆమెకు ఆపరేషన్ చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆమెను ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అయితే ఇంటికి వెళ్లిన కొద్దిరోజులకే ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు ప్రారంభమయ్యాయి.

# ప్రభుత్వ విద్యాసంస్థలే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది






### పేద విద్యార్థులకు తోడ్పాటు అందిస్తా

### విద్యార్థుల కోసం 30 కుర్చీలు, 5 టేబుళ్లు, 3 ఉపాధ్యాయుల కుర్చీలను అందజేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వర్ధన్నపేట ప్రతినిధి , ఆగస్టు 20 (తరంగాలు):** చదువుతోనే ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని, పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. అధికారులతో కలిసి కళాశాల పరిసరాలను పరిశీలించి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం 30 కుర్చీలు, 5 టేబుళ్లు, 3 ఉపాధ్యాయుల కుర్చీలను అందజేశారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా త్వరలో ఫ్యాన్లు, లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.విద్యార్థినీ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి మంచి భవిష్యత్తులో స్థిరపడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ విద్యాసంస్థలే బలమైన పునాదులని పేర్కొన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరి నాణ్యమైన విద్యను అభ్యసించాలని సూచించారు.ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రమైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ తరగతి గదులు అందుబాటులో ఉండేలా ఉపాధ్యాయులు, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ షిభారాణి రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పొశాల వెంకన్న గౌడ్ , ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి, కిమా నాయక్, ప్రిన్సిపాల్ సుజాత, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# సచిన్‌తో పోల్చితే కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడు






### సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్

భారత క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, విరాట్ కోహ్లీలో ఎవరు అత్యుత్తమం అనే చర్చ తరుచూ జరుగుతూనే ఉంటుంది. భారత క్రికెట్ ఐకాన్స్ అయిన ఈ ఇద్దరి మధ్య పోలిక అనవసరమని చాలా మంది మాజీ క్రికెటర్లు సమాధానం చెప్పేందుకు తప్పించుకున్నారు. ఇద్దరి క్రికెటర్ల తరాలు భిన్నమైనవని, ఇద్దర్ని పోల్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. కానీ తాజాగా సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్‌ను ఇదే ప్రశ్న అడగ్గా.. నిర్మొహమాటంగా సమాధానం చెప్పాడు. సచిన్‌తో పోల్చితే విరాట్ కోహ్లీనే అత్యుత్తమ ఆటగాడని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా టెస్ట్‌ల్లో విదేశీ గడ్డపై విరాట్ కోహ్లీ రాణించినట్లుగా సచిన్ ఆడలేకపోయాడని తెలిపాడు. విరాట్ కోహ్లీ విదేశీ గడ్డపై భారత బ్యాటింగ్ స్థాయిని పెంచారని, తన సమకాలీన ఆటగాళ్లు కూడా అక్కడి పరిస్థితుల్లో మెరుగ్గా రాణించేలా ప్రేరేపించారని ఏబీడీ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా పేర్కొన్నాడు. 'విదేశాల్లో సచిన్ టెండూల్కర్ ఒక ప్రమాణాన్ని నెలకొల్పాడు. కానీ కోహ్లీ ఆ ప్రదర్శనలను మరో స్థాయికి తీసుకెళ్లాడు. టెస్ట్ క్రికెట్‌లో 15,921 పరుగులు, 51 సెంచరీలతో సచిన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 176 ఇన్నింగ్స్‌ల్లో విదేశీ గడ్డపై 51 సగటుతో పరుగులు చేశాడు. మరోవైపు విరాట్ కోహ్లీ 123 టెస్ట్‌ల్లో 46.85 సగటుతో 9,230 పరుగులు చేశాడు. విదేశాల్లో కోహ్లీ సగటు 68 మ్యాచ్‌ల్లో 41గా ఉంది. భారత్ కోసం సచిన్ కొత్త ఒరవడిని ప్రారంభించినా.. విరాట్ కోహ్లీ అంతటి స్థాయి అప్పట్లో సచిన్‌కు లేదు. విదేశాల్లో బౌన్సీ, సీమింగ్ పిచ్‌లపై కూడా రాణించవచ్చని నిరూపించిన మొదటి వ్యక్తి సచిన్'అని ఏబీ డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. విరాట్ కోహ్లీ, సచిన్ టెండూల్కర్ అడుగుజాడల్లో దేవదత్ పడిక్కల్, కేఎల్ రాహుల్ కొనసాగుతున్నారని డివిలియర్స్ పేర్కొన్నాడు. 'కేఎల్ రాహుల్‌కు మంచి టెక్నిక్ ఉంది. అతను భారత జట్టుకు ఒక పెద్ద ఆస్తి. కానీ విదేశాల్లో అతని సగటు కేవలం 34 మాత్రమే. ఈ విషయంలో అతను ఇంకా మెరుగవ్వాలి. క్రీజులో సెట్ అయిన తర్వాత భారీ స్కోర్లు చేయాలి. కేవలం సెంచరీలే కాకుండా డబుల్ సెంచరీలు చేయాలి. ఎందుకంటే కొత్త బంతికి ఔటవ్వడం ఎప్పుడైనా జరగవచ్చు. కాబట్టి మెరుగైన ఆరంభాన్ని భారీ స్కోర్లుగా మల్చాలి'అని డివిలియర్స్ సూచించాడు.

(సంపాదకీయం)

## ఉగ్రవాద బాధితుల త్యాగాలు మరువరానివి



డెస్క్, ఆగస్టు 20 : ఉగ్రవాదం అనే పదం వినగానే మనసులో భయం, విషాదం, విధ్వంసం వంటి భావనలు మెదులుతాయి. ప్రపంచ చరిత్రలో అనేక ఉగ్రదాడులు వేలాది కుటుంబాలను కన్నీటి సంద్రంలో ముంచాయి. అమాయక ప్రజలు, చిన్నారులు, మహిళలు, భద్రతా సిబ్బంది ఉగ్రవాదుల హింసకు బలైపో యారు. వారి జీవితాలు క్షణాల్లో ముగిసిపోయినా, వారి కుటుంబాల బాధ మాత్రం జీవితాంతం కొనసాగుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 21న నిర్వహించే అంతర్జాతీయ జ్ఞాపకాలు మరియు సంతాప దినం ఉగ్రవాద బాధితులను స్మరించుకోవడానికి, వారి త్యాగాలను ప్రపంచానికి గుర్తు చేయడానికి ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది. ఉగ్రవాద దాడులు కేవలం ప్రాణనష్టానికే పరిమితం కావు. ఒక కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోతుంది. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అనాథలుగా మారతారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు జీవితాంతం మానసిక వేదనలో గడుపుతారు. భర్తను కోల్పోయిన భార్య, భార్యను కోల్పోయిన భర్త, కుటుంబ సభ్యులను కోల్పోయిన బంధువులు ఎదుర్కొనే బాధను మాటల్లో వర్ణించడం సాధ్యం కాదు. ఉగ్రవాదం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, ఒక కుటుంబాన్ని, కొన్నిసార్లు ఒక సమాజాన్ని కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

ప్రపంచంలోని అనేక దేశాలు ఉగ్రవాదం వల్ల తీవ్ర నష్టాలను చవిచూశాయి. పాఠశాలలు, ప్రార్థనా మందిరాలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రజా ప్రదేశాలు వంటి చోట్ల జరిగిన దాడులు ఎన్నో అమాయక ప్రాణాలను బలిగొన్నాయి. తమ రోజువారీ పనుల్లో నిమగ్నమైన సాధారణ ప్రజలు ఒక్కసారిగా హింసకు గురయ్యారు. ఈ ఘటనలు మానవత్వంపై జరిగిన దాడులుగా చరిత్రలో నిలిచిపోయాయి. ప్రతి ఉగ్రదాడి వెనుక అనేక కుటుంబాల కన్నీటి గాథలు దాగి ఉంటాయి. ఉగ్రవాద సంస్థల ప్రధాన లక్ష్యం భయాన్ని సృష్టించడం. ప్రజల్లో అసురక్షిత భావనను పెంచడం. సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడం. అయితే చరిత్ర చెబుతున్న విషయం ఏమిటంటే, ఉగ్రవాదం తాత్కాలికంగా భయాన్ని సృష్టించగలిగినా మానవత్వాన్ని ఓడించలేకపోయింది. ప్రతి విషాద ఘటన తర్వాత సమాజం మరింత ఐక్యంగా నిలబడింది. బాధిత కుటుంబాలకు అండగా నిలిచింది. అదే మానవత్వం యొక్క గొప్పతనం.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం కేవలం భద్రతా బలగాల బాధ్యత మాత్రమే కాదు. సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత కూడా. ద్వేషపూరిత ప్రచారాలను, హింసాత్మక భావజాలాన్ని ప్రారంభ దశలోనే అడ్డుకోవాలి. యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను నిరోధించాలి. శాంతి, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను కుటుంబం నుంచి విద్యాసంస్థల వరకు ప్రతి స్థాయిలో బలపరచాలి. సమాజంలో చైతన్యం పెరిగినప్పుడే ఉగ్రవాదానికి బలమైన ఎదురుదెబ్బ ఇవ్వగలం. ఉగ్రవాద బాధితులను స్మరించుకోవడం అంటే కేవలం ఒక రోజు నివాళులు అర్పించడం మాత్రమే కాదు. వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందించడం కూడా అంతే ముఖ్యమైనది. అనేక మంది బాధిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో పాటు మానసిక కుంగుబాటును ఎదుర్కొంటుంటాయి. వారికి విద్య, వైద్యం, ఉపాధి, పునరావాసం వంటి రంగాల్లో ప్రత్యేక సహాయం అందించాల్సిన అవసరం ఉంది. బాధితుల జీవితాలు తిరిగి గాడిలో పడేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సమాజం కలిసి పనిచేయాలి.

భారతదేశం కూడా ఉగ్రవాదం వల్ల ఎన్నోసార్లు దెబ్బతింది. దేశ భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన భద్రతా సిబ్బంది, అమాయక పౌరులు మన జ్ఞాపకాలలో ఎప్పటికీ నిలిచి ఉంటారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన వీరులను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. వారి త్యాగాలు దేశ ఐక్యతకు, భద్రతకు ఎంత విలువైనవో యువతకు తెలియజేయాలి.

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో ఉగ్రవాదం కూడా కొత్త రూపాలు సంతరించుకుంటోంది. సామాజిక మాధ్యమాలు, అంతర్జాల వేదికల ద్వారా యువతను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందువల్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ ఉగ్రవాద కార్యకలాపాలను అడ్డుకోవడం అత్యవసరం. అదే సమయంలో ప్రజల్లో అవగాహన పెంచడం కూడా ముఖ్యమైన అంశంగా మారింది.అంతర్జాతీయ జ్ఞాపకాలు మరియు సంతాప దినం ప్రపంచ దేశాలకు ఒక కీలక సందేశాన్ని అందిస్తోంది. ఉగ్రవాదాన్ని ఏ రూపంలోనూ సమర్థించరాదని, బాధితుల పట్ల సంఘీభావం ప్రకటించాలని ఈ దినం పిలుపునిస్తోంది. మతం, జాతి, భాష, ప్రాంతం అనే తేడాలు లేకుండా ఉగ్రవాద బాధితులందరూ మానవత్వానికి చెందినవారే. వారి బాధను ప్రపంచం మొత్తం పంచుకోవాల్సిన అవసరం ఉంది. ఉగ్రవాద బాధితుల జ్ఞాపకాలు కేవలం చరిత్ర పుటల్లో మాత్రమే కాదు, మన హృదయాల్లో కూడా సజీవంగా ఉండాలి. వారి త్యాగాలు మరచిపోకుండా, భవిష్యత్ తరాలకు శాంతి, సామరస్యం, మానవత్వం విలువలను అందించడం మనందరి బాధ్యత. హింసకు బదులుగా శాంతిని, ద్వేషానికి బదులుగా ప్రేమను, విభజనకు బదులుగా ఐక్యతను ప్రోత్సహించినప్పుడే ఉగ్రవాదానికి నిజమైన సమాధానం ఇచ్చినట్టవుతుంది. ఉగ్రవాద రహిత ప్రపంచ నిర్మాణమే బాధితులందరికీ మనం అర్పించే అత్యంత గొప్ప నివాళి.